# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి/హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 189, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు ( 9491020055) గురువారం - 19 - సెప్టెంబర్ - 2024


వరుస రైలు ప్రమాదాలపై
## అమిత్ షా కీలక వ్యాఖ్యలు

రైలు ప్రమాదాల వెనుక కుట్రలు దాగి ఉంటే వెలికి తీస్తాం

ఎలాంటి కుట్రలు అయినా ఎక్కువ రోజులు దాగి ఉండవన్న అమిత్ షా

ప్రమాదాల మూల కారణాలపై దర్యాప్తు చేస్తామన్న అమిత్ షా


2

అక్టోబరు 1 వరకు బుల్డోజర్ చర్యలు వద్దన్న
## అత్యున్నత న్యాయస్థానం

దేశవ్యాప్తంగా బుల్డోజర్ సంస్కృతిపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

పలు రాష్ట్రాల్లో నేరస్తులు, సంఘ వ్యతిరేక శక్తుల ఇళ్ల కూల్చివేత

బుల్డోజర్ న్యాయం పేరిట చర్యలను నిరసిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు


2

## ఘనంగా ఖైరతాబాద్ గణేషుడి నిమజ్జనం

ఎన్టీఆర్ మార్గ్‌లోని నాలుగో నెంబర్ క్రేన్ వద్ద గణేశుడి నిమజ్జనం

ఉదయం ఖైరతాబాద్ నుంచి ప్రారంభమైన భారీ శోభాయాత్ర

గణనాథుడిని చూసేందుకు వేలాదిగా తరలి వచ్చిన భక్తులు

కేవలం హుండీ ఆదాయమే రూ.70 లక్షలు వచ్చింది


2

## వైద్యుల డిమాండ్లకు తలొగ్గిన దీదీ సర్కార్..




- పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్ల ఆందోళన కొలిక్కి
- కోల్‌కతా సీపీ సహా పలువురిపై వేటు
- ఐదు డిమాండ్లలో మూడింటికి మమతా సర్కార్ అంగీకారం
- మిగిలిన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నేతృత్వంలోని కమిటీ కార్యాచరణ

# ప్రభుత్వానికి 100 రోజులు..

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ క్యాబినెట్ భేటీ

వాలంటీర్ల కాలపరిమితి గతేడాదే ముగిసిందని వెల్లడి

కానీ జగన్ వాలంటీర్ల సర్వీస్ ను పొడిగించలేదని ఆరోపణ

చంద్రబాబు తగిన నిర్ణయం తీసుకుంటారని స్పష్టీకరణ

అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఏపీ క్యాబినెట్ భేటీ ముగిసింది. క్యాబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాలు, చర్చించిన అంశాలు, ఆమోదం తెలిపిన అంశాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియా సమావేశం ద్వారా వెల్లడించారు. వాలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రభుత్వ శాఖలతో సమీకృతం చేస్తూ ఒక సమగ్ర నివేదిక ఇవ్వాలని మంత్రిమండలి సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 2.63 లక్షల మంది వాలంటీర్లు ఉన్నారని, వారిలో 1.07 లక్షల మంది



ఆంధ్రప్రదేశ్ లో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఎన్డిఏ శాసనసభా పక్ష సమావేశం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ లో జరిగింది. ఈ భేటీకి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందీశ్వరి హాజరయ్యే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు అవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు,



వివరాలు 2లో..

దేశానికి ఎనర్జీ స్టోరేజ్ క్యాపిటల్ గా ఏపీని మార్చుతాం


2

- విద్యుత్ స్టోరేజికి ఆంధ్రప్రదేశ్ ను కేరాఫ్ అడ్రస్ గా నిలిపే లక్ష్యం
- రాష్ట్రంలో పెట్టుబడుల కోసం జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులతో చర్చించాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తాము కీలక లక్ష్యాలను నిర్దేశించుకున్నాం
- రాష్ట్రంలో ప్రస్తుతం 3.0 సంస్కరణలను అమలు చేస్తున్నాం

మోదీకి చంద్రబాబు, రేవంత్ రెడ్డి
## శుభాకాంక్షలు

ప్రధాని మోదీ పుట్టినరోజు



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు . ఈ సందర్భంగా ఆయనకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు. "గౌరవనీయులైన ప్రధాని నరేంద్ర మోదీ గారికి జన్మదిన శుభాకాంక్షలు. దేశ సేవ చేసేందుకు ఆయనకు మంచి ఆరోగ్యాన్ని, సంపూర్ణ జీవితాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. మోదీ విజనరీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతూనే ఉంటుంది" అని చంద్రబాబు ట్వీట్ చేశారు. "గౌరవనీయులైన ప్రధాని మోదీ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. మన దేశాన్ని పురోగతి దిశగా నడిపించేలా ఆయనకు మనోబలాన్ని, ఆరోగ్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని రేవంత్ ట్వీట్ చేశారు.

ఎన్నికలు అయ్యేంత వరకే నేను ముఖ్యమంత్రిగా ఉంటాను...
# ఆ తర్వాత మళ్లీ కేజ్రీవాలే

- ఢిల్లీ కొత్త సీఎం అతిశీ
- వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించాక కేజ్రీవాల్ సీఎంగా బాధ్యతలు చేపడతారు
- ఇతర పార్టీల్లో ఉంటే తనకు టిక్కెట్ కూడా దక్కకపోయేదని వ్యాఖ్య
- కేజ్రీవాల్ మాత్రం తనను ఎమ్మెల్యే స్థాయి నుంచి సీఎంగా చేశారన్న అతిశీ




ఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగేంత వరకు మాత్రమే తాను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటానని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించాక మళ్లీ సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ బాధ్యతలు చేపడతారని అతిశీ అన్నారు. తదుపరి ఢిల్లీ సీఎంగా ఎంపికైన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ...

## చంద్రబాబు అక్రమ కట్టడంలో నివసిస్తున్నారు



- చంద్రబాబు సిగ్గు విడిచిన వ్యక్తి... ఆయన ఇంటిని కూల్చాల్సిందే
- చంద్రబాబుపై మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించిన విజయసాయి
- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంగా వ్యవహరిస్తోంది

# నేను ఫామ్ హౌస్ సీఎంను కాను

## ఎన్ని విమర్శలు వచ్చినా కూల్చివేతలు ఆపేదిలేదు

- ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వం
- కేసీఆర్ పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నా
- నేను పనిచేసే సీఎంని
- హైడ్రాపై ముఖ్యమంత్రి రేవంత్ కీలక వ్యాఖ్యలు
- దీని వెనక ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవు




హైదరాబాద్: రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత తెలంగాణ ప్రజలదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అంటేనే త్యాగం, బలిదానమని చెప్పారు. విలీనం, విమోచనం అంటూ స్వప్రయోజనాల కోసం యత్నించడం సరికాదని అన్నారు. నియంత నుంచి తెలంగాణకు విముక్తి కలిగిస్తామని ఆనాడు భరోసా ఇచ్చామని... పదేళ్ల పాటు కేసీఆర్



చెరువులు, కుంటలలో అక్రమంగా నిర్మించిన భవనాలను కూల్చివేసే విషయంలో వెనక్కి తగ్గేదే లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రాపై ఎన్ని విమర్శలు వచ్చినా ముందుకే వెళతామని వివరించారు. ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలను ఆయన కొట్టిపారేశారు. హైడ్రా ఏర్పాటు, కూల్చివేతల వెనక ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు తమకు లేవని తేల్చిచెప్పారు. ఈమేరకు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

వివరాలు 2లో..

## సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం మానుకోవాలి


2లో

- రాష్ట్రంలో పాలనే లేదు.. సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినం అట
- ఎంతోమంది పోరాటం వల్ల స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నాం
- కులాలు, మతాలకు అతీతంగా తెలంగాణ ప్రజలు ఉంటారు
- ఉద్యోగాల కోసం యువత ఎదురుచూస్తున్నారు

తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలం ముందు
- పెట్టుకుందాం అనుకుంటే అక్కడ రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్ గాంధీ విగ్రహం

## తెలంగాణకు కొత్త ఎన్నికల కమిషనర్



ఈ నెల 8న ముగిసిన ప్రస్తుత ఎన్నికల కమిషనర్ పార్థసారథి పదవీకాలం

ఆయన స్థానంలో రాణి కుముదినిని నియమించిన ప్రభుత్వం

ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉత్తర్వులు జారీ

### అక్టోబరు 1 వరకు బుల్డోజర్ చర్యలు వద్దన్న
# అత్యున్నత న్యాయస్థానం

ఢిల్లీ: దేశవ్యాప్తంగా బుల్డోజర్ సంస్కృతిపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ముందస్తు అనుమతులు లేకుండా బుల్డోజర్ చర్యలు వద్దని స్పష్టం చేసింది. అక్టోబరు 1 వరకు బుల్డోజర్ చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. అయితే, ఫుట్ పాత్ లు, రహదారుల ఆక్రమణలు, రైల్వే లైన్లు, జలవనరుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవచ్చని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. దేశంలోని పలు రాష్ట్రాల్లో, ముఖ్యంగా యూపీ వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో సంఘ వ్యతిరేక శక్తులు, నేరగాళ్ల ఇళ్లను ప్రభుత్వాలు బుల్డోజర్లతో కూల్చివేస్తున్న ఉదంతాలు పెరుగుతున్నాయి. బుల్డోజర్ చర్యలకు వ్యతిరేకంగా జమాత్ ఉలేమా హింద్, తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ లతో కూడిన సుప్రీం ధర్మాసనం నేడు విచారణ చేపట్టింది. కూల్చివేతలకు ముందు నోటీసులు ఇవ్వాలని, నిబంధనలకు విరుద్ధంగా కూల్చినట్టయితే సంబంధిత అధికారులను బాధ్యులను చేయాలని పిటిషనర్లు కోర్టును కోరారు. కూల్చివేతలు ఆపేస్తే, ఆక్రమణల తొలగింపు ఆలస్యం అవుతుందన్న ప్రభుత్వ వాదనలను ద్విసభ్య ధర్మాసనం తోసిపుచ్చింది. యూపీ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. 'బుల్డోజర్ న్యాయం' పేరిట చర్యలు చేపట్టడం హీరోయిజం అనిపించుకోదని, అక్టోబరు 1 వరకు కూల్చివేతలు ఆపినంత మాత్రాన కొంపలు మునిగిపోయే పరిస్థితులు ఏర్పడవని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అనంతరం తదుపరి విచారణను అక్టోబరు 1కి వాయిదా వేసింది.

## వరుస రైలు ప్రమాదాలపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ: వరుసగా జరుగుతున్న రైలు ప్రమాదాలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ రైలు ప్రమాదాల వెనుక ఏవైనా కుట్రలు, కుతంత్రాలు దాగి ఉంటే వెలికి తీస్తామన్నారు. ప్రభుత్వ పనితీరుపై ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏ విషయంలోనైనా ఎలాంటి కుట్రలైనా ఉంటే ఎక్కువ రోజులు దాగి ఉండవన్నారు. 1.10 లక్షల కిలోమీటర్ల రైల్వే నెట్ వర్క్ పరిరక్షణకు తమ ప్రభుత్వం అతి త్వరలో కీలక చర్యలు తీసుకోనుందన్నారు. రైల్వే భద్రత విషయమై మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చించినట్లు తెలిపారు. రైల్వే ప్రమాదాల విషయానికి వస్తే వాటి మూల కారణాలపై దర్యాప్తు చేస్తామన్నారు. కారణం ఏదైనా ప్రభుత్వం వీటిపై దృష్టి సారిస్తోందన్నారు. ఇది కుట్ర అయితే ఎక్కువ కాలం కొనసాగదని స్పష్టం చేశారు. లోపాలు ఉంటే మాత్రం సరి చేస్తామని తెలిపారు. ఇటీవల జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. మోదీ ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లో 38 రైలు ప్రమాదాలు జరిగాయని ప్రతిపక్షం ఆరోపిస్తోందని, కానీ అవన్నీ చిన్న ఘటనలే అని స్పష్టం చేశారు. ఈ వంద రోజుల్లో ఎనిమిది కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేశామన్నారు. ఈ ప్రాజెక్టులతో దాదాపు 4.42 కోట్ల మానవ పనిదినాల ఉపాధి లభిస్తుందన్నారు. కాగా, కొన్నిరోజులుగా దుండగులు రైల్వే పట్టాలపై ఎల్పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుపరాడ్లు, సిమెంట్ ఇటుకలను పెట్టి రైలు ప్రమాదాలు జరిగేలా దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి అంశాలపై అమిత్ షా స్పందించారు.

## తెలంగాణకు కొత్త ఎన్నికల కమిషనర్

హైదరాబాద్: తెలంగాణ ఎన్నికల కమిషనర్‌గా రిటైర్ ఐఏఎస్ ఆఫీసర్ రాణి కుముదిని నియమితులయ్యారు. ప్రస్తుత ఎన్నికల కమిషనర్ పార్థసారధి పదవీకాలం ఈ నెల 8న ముగిసింది. దాంతో ఆయన స్థానంలో రాణి కుముదినిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. మూడేళ్లు ఆమె ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, 1988 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కుమిదిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. కేంద్ర సర్వీసుల అనంతరం తెలంగాణ రాష్ట్ర కార్మికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు పదవీ విరమణ చేశారు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కొత్త ఎన్నికల కమిషనర్ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

## దేశానికి ఎనర్జీ స్టోరేజ్ క్యాపిటల్ గా ఏపీని మార్చుతాం

అమరావతి: ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ గుజరాత్‌లోని గాంధీనగర్‌లో 'రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్-2024'లో పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులతో చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు, మానవ వనరుల గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ.. ఏపీలో పునరుత్పాదక విద్యుత్ ఆధారంగా ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ ను అందించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తాము కీలక లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు తెలిపారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను అందుకునే దిశగా సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను ఆంధ్రప్రదేశ్ లో ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. దీనితో పాటు విద్యుత్ స్టోరేజి సాంకేతికత కూడా వినియోగిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3.0 సంస్కరణలను అమలు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్ స్టోరేజి విధానంపై ప్రధానంగా దృష్టి పెట్టామని చెప్పారు. విద్యుత్ స్టోరేజికి ఆంధ్రప్రదేశ్ ను కేరాఫ్ అడ్రస్ గా నిలిపే లక్ష్యంతో తాము పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ను ఎనర్జీ క్యాపిటల్‌గా గుర్తింపు తీసుకొస్తామన్నారు. దీనికోసం పెద్ద ఎత్తున బ్యాటరీ స్టోరేజి విధానం, పంప్డ్ హైడ్రో స్టోరేజి, ఇతర అభివృద్ధి చెందిన విద్యుత్ స్టోరేజి సాంకేతికతను వినియోగిస్తామని చెప్పారు. రూఫ్‌టాప్ సోలార్, డీ- సెంట్రలైజ్డ్ మైక్రో గ్రిడ్ల ఏర్పాటుతో విద్యుత్ ఉత్పత్తిని ప్రజలకు మరింత చేరువ చేసి, క్షేత్రస్థాయిలో ఇంధన భద్రత పెంచుతామని వివరించారు.

## ఘనంగా ఖైరతాబాద్ గణేషుడి నిమజ్జనం

హైదరాబాద్: హైదరాబాద్‌లో ఘనంగా గణనాథుల శోభాయాత్ర కొనసాగింది. హుస్సేన్ సాగర్ వద్ద భారీ ఏర్పాట్లను చేశారు. ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం హుస్సేన్ సాగర్‌లో ముగిసింది. ఎన్టీఆర్ మార్గ్‌లోని నాలుగో నెంబర్ క్రేన్ వద్ద ఖైరతాబాద్ భారీ వినాయకుడి నిమజ్జనం జరిగింది. ఇక అంతకుముందు నిర్వాహకులు ఖైరతాబాద్ గణేషుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గణపతి శోభాయాత్ర ప్రారంభమైంది. మధ్యాహ్నం సమయానికి ఎన్టీఆర్ మార్గ్ వద్దకు చేరుకుంది. ఈ శోభాయాత్రలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా.. ఖైరతాబాద్ గణేషుడి హుండీ ఆదాయం భారీగా వచ్చింది. కేవలం హుండీ ఆదాయమే రూ.70 లక్షలు వచ్చిందని నిర్వాహకులు చెప్పారు. మరోవైపు హుస్సేన్‌సాగర్ వద్ద సందడి వాతావరణం కనిపిస్తోంది. నగరం నలుమూలల నుంచి వినాయకుడి విగ్రహాల నిమజ్జనాలు ఇక్కడ జరుగుతున్నాయి. వేలాది విగ్రహాలు హుస్సేన్ సాగర్‌కూ క్యూ కట్టాయి. శోభయాత్ర ఘనంగా నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు భక్తులు. బ్యాండ్ చప్పుళ్ల మధ్య డ్యాన్సలు చేస్తూ ఆనందోత్సాహాల మధ్య ముందుకు వస్తున్నారు. నిమజ్జనం వేడుకను చూసేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, తెలుగుతల్లి ఫ్లైఓవర్, సచివాలయం, ఐమాక్స్ మార్గాలు గణనాథుల విగ్రహాలు, భక్తులతో కిక్కిరిసిపోయాయి.

## వైద్యుల డిమాండ్లకు తలొగ్గిన దీదీ సర్కార్..

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్ల ఆందోళన కొలిక్కి వచ్చింది. కోల్‌కతాలో నెలరోజులకు పైగా ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యుల డిమాండ్లు నెరవేర్చేందుకు దీదీ ప్రభుత్వం అంగీకరించింది . నాలుగుసార్లు రద్దు అయిన తర్వాత సోమవారం రాత్రి జూనియర్ డాక్టర్లు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తో చర్చలు జరిపిన విషయం తెలిసిందే. దాదాపు ఆరు గంటల పాటు జరిగిన ఈ చర్చల్లో వైద్యులు ఐదు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. ఐదు డిమాండ్లలో మూడింటికి మమతా సర్కార్ అంగీకరించింది. ఈ మేరకు వారి డిమాండ్లు నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే వైద్యులతో సమావేశం ముగిసిన గంటల వ్యవధిలోనే కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్, వైద్యశాఖకు చెందిన ఇద్దరు అధికారులను తొలగిస్తున్నట్టు ప్రకటించింది. వారి స్థానంలో మంగళవారం కొత్త అధికారులను నియమించనున్నట్లు వెల్లడించింది. మిగిలిన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నేతృత్వంలోని కమిటీ కార్యాచరణ చేపట్టనుందని చర్చల ముగిసిన అనంతరం స్వయంగా మమత ప్రకటించారు. డిమాండ్లకు అంగీకారం తెలిపిన నేపథ్యంలో ఇక ఆందోళనలను విరమించాలని వైద్యులను మమతా బెనర్జీ కోరారు. ఆందోళనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోమని, వైద్యులు వెంటనే విధుల్లో చేరాలని విజ్ఞప్తి చేశారు. సామాన్య ప్రజలు వైద్యం అందక అల్లాడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య రంగానికి సంబంధించి మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారం కోసం ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఒక ప్రత్యేక కమిటీని సైతం నెలకొల్పుతున్నట్లు ప్రకటించారు.

# ప్రభుత్వానికి 100 రోజులు..

మొదటి పేజి తరువాయి

రాజీనామా చేశారని పార్థసారథి వివరించారు. పాలన అంతా వాలంటీర్ల మీదే నడుస్తోంది అన్నట్టుగా గత ప్రభుత్వం ప్రచారం చేసుకుందని విమర్శించారు. వాలంటీర్లే మెరుగైన సేవలు అందిస్తున్నారు, ప్రభుత్వ విజయానికి వారే ముఖ్య కారకులని కూడా చెప్పుకున్న గత ప్రభుత్వం... 2023 ఆగస్టు 15 తర్వాత వారి సేవలను పొడిగించకుండా ఎందుకు మోసం చేసిందన్నది అర్థంకాని విషయం అని పేర్కొన్నారు. 2023లోనే వాలంటీర్ల పదవీకాలం ముగిస్తే, ఎందుకు పొడిగించలేదని ప్రశ్నించారు. వాలంటీర్లు సర్వీస్ లో ఉన్నారో, లేదో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొందని అన్నారు. ఇలా వాలంటీర్లను మోసం చేయడానికి కారణాలేంటో కూడా గత ప్రభుత్వంలో ఉన్నవారే చెబితే బాగుంటుందని మంత్రి పార్థసారథి సూచించారు. ఏదేమైనా గానీ సమగ్ర నివేదికతో రావాలని సంబంధిత శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని, వాలంటీర్ల విషయంలో తమ ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఇక, వాలంటీర్లకు దినపత్రిక కొనుగోలు చేసేందుకు ప్రతినెలా ఇస్తున్న రూ.200 రద్దు చేస్తున్నట్టు మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. దినపత్రిక కొనుగోలుకు సంవత్సరానికి గత ప్రభుత్వంలో రూ.102 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. దినపత్రిక కొనుగోలుపై విచారణకు క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు.

ఇతర వివరాలు...

ఇంటింటికి వెళ్లి 100 రోజుల కూటమి ప్రభుత్వ పాలన గురించి వివరించేలా కార్యాచరణ, నూతన మద్యం విధానంపై మంత్రివర్గ సమావేశంలో చర్చ, అందుబాటులోకి నాణ్యమైన మద్యం బ్రాండ్లు... సగటు మద్యం ధర రూ.99గా నిర్ణయం, భోగాపురం ఎయిర్ పోర్టు పేరును మార్చేందుకు క్యాబినెట్ నిర్ణయం, ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ 'స్టెమీ' పథకం, ఆధార్ తరహాలో విద్యార్థులకు 'అపార్' గుర్తింపు కార్డులు, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన, రాష్ట్ర హోంశాఖలో కొత్త కార్పొరేషన్ ఏర్పాటు... కార్పస్ ఫండ్ గా రూ.10 కోట్లు, ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి డీమ్డ్ హోదా ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం, రూ.1000 కోట్లతో రాష్ట్రంలో బిట్స్-పిలానీ విద్యాసంస్థ స్థాపనకు చర్యలు, చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి సిఫారసు, కౌలు కార్డుల నమూనా మార్చాలని క్యాబినెట్ నిర్ణయం. రైతు సంతకం అవసరం లేకుండానే కౌలు కార్డుల జారీ, పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు పాత ఏజెన్సీకే ఇవ్వాలని నిర్ణయం, మాజీ సైనికుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటుకు క్యాబినెట్ నిర్ణయం

# నేను ఫామ్ హౌస్ సీఎంను కాను



పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెడుతున్నామని చెప్పారు. ప్రభుత్వం తరపున పబ్లిక్ గార్డెన్స్ లో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పాలన పారదర్శకంగా ఉండాలని కోరుకుంటున్నామని సీఎం తెలిపారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. గత పదేళ్లగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీకి వెళ్తుంటే... తనపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మన రాష్ట్రానికి రావాల్సిన వాటి కోసం ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లడానికైనా తాను సిద్ధమని అన్నారు. తాను ఫామ్ హౌస్ సీఎం కాదని... పనిచేసే సీఎంనని చెప్పారు. "తెలంగాణ భౌగోళిక స్వరూపం బిగించిన పిడికిలి మాదిరిగా ఉంటుంది. ఆ పిడికిలి పోరాటానికి సంకేతం. తెలంగాణలో అన్ని జాతులు, కులాలు, మతాలు కలిసికట్టుగా ఉంటాయన్న సందేశం అందులో ఇమిడి ఉంది. ఈ ఐక్యతను, ఈ సమైక్యతను దెబ్బతీసే విధంగా సెప్టెంబర్ 17ను కొందరు వివాదాస్పదం చేయడం మంచిది కాదు. ఎందరో మహనీయుల త్యాగఫలం మన తెలంగాణ. పరిపాలనలో, ప్రతి నిర్ణయం సందర్భంలో వారి త్యాగాలు మాకు గుర్తుంటాయి. నాలుగు కోట్ల ప్రజల సంక్షేమమే గీటురాయిగా పాలన ఉంటుంది. తెలంగాణ ప్రజలే ఈ రాష్ట్ర ప్రస్థానానికి నావికులు. వారి ఆలోచనలే మా ఆచరణ. వారి ఆకాంక్షలే మా కార్యాచరణ" అని సీఎం చెప్పారు.

జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా, సంక్షిప్త నామాన్ని టీజీగా మార్చడం, సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ, గద్దర్ పేరిట అవార్డులు, మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరును ఖరారు చేయడం వంటి తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి చేపట్టిన అనేక చర్యలను ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు.

హైడ్రాపై ముఖ్యమంత్రి రేవంత్ కీలక వ్యాఖ్యలు

చెరువులు, కుంటలలో అక్రమంగా నిర్మించిన భవనాలను కూల్చివేసే విషయంలో వెనక్కి తగ్గేదే లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రాపై ఎన్ని విమర్శలు వచ్చినా ముందుకే వెళతామని వివరించారు. ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలను ఆయన కొట్టిపారేశారు. హైడ్రా ఏర్పాటు, కూల్చివేతల వెనక ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు తమకు లేవని తేల్చిచెప్పారు. ఈమేరకు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్ టీఎల్), బఫర్ జోన్ లలో కట్టిన బిల్డింగ్ లు ఎంతపెద్ద వారివైనా వదిలిపెట్టబోమని రేవంత్ రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. ఈ విషయానికి సంబంధించి హైడ్రా ఇప్పటికే పలువురు ఆక్రమణదారులకు, బడాబాబులకు నోటీసులు ఇచ్చిందని గుర్తుచేశారు. హైడ్రా పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం... అధికారుల పనిలో తమ జోక్యం ఉండదని వివరించారు. కాగా, ఎఫ్ టీఎల్ పరిధిలోని నిర్మాణాలకు సంబంధించిన యజమానులకు హైడ్రా నోటీసులు పంపించింది. వెంటనే వాటిని కూల్చేయాలని హెచ్చరించింది. లేదంటే తామే రంగంలోకి దిగి వాటిని కూల్చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

### ఎన్నికలు అయ్యేంత వరకే నేను ముఖ్యమంత్రిగా ఉంటాను...
# ఆ తర్వాత మళ్లీ కేజ్రీవాలే



తాను ఇతర పార్టీల్లో ఉన్నట్లయితే కనీసం టిక్కెట్ కూడా దక్కకపోయేదన్నారు. కానీ కేజ్రీవాల్ తనకు టిక్కెట్ ఇచ్చి ఎమ్మెల్యేను చేసి, ఆ తర్వాత మంత్రిని చేసి, ఇప్పుడు ముఖ్యమంత్రిని చేశారని వెల్లడించారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు కేజ్రీవాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించారన్నారు. ఇలాంటి అవకాశం కేవలం ఆమ్ ఆద్మీ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తనకు ఈ అవకాశం కల్పించారని వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేయడం తనకు ఎంతో బాధ కలిగించిందన్నారు. తాను ముఖ్యమంత్రి పదవి చేపట్టానని అభినందించవద్దని, పూలమాలలు అవసరం లేదని సూచించారు. ఎన్నికల తర్వాత మళ్లీ కేజ్రీవాల్ సీఎం అవుతారన్నారు. మద్యం పాలసీ కేసులో తప్పుడు ఆరోపణలతో కేజ్రీవాల్‌ను జైల్లో పెట్టారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు కేంద్రంలోని బీజేపీకి, దర్యాప్తు సంస్థలకు చెంపపెట్టు అన్నారు.

కేజ్రీవాల్ అరెస్ట్ అక్రమం అని అన్నారు. కేజ్రీవాల్ స్థానంలో మరొకరు ఉంటే పదవిని వదులుకునే వారు కాదన్నారు.

అతిశీకి ఉన్న క్లీన్ ఇమేజ్.. ఆమ్ ఆద్మీ పార్టీతో రాజకీయ ప్రవేశం చేసిన అతిశీ ఇప్పటి వరకు క్లీన్ ఇమేజ్ కలిగి ఉన్నారు. ఆమెపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు. అరవింద్ కేజ్రీవాల్ కు మనీశ్ సిసోడియాకు అతిశీ అత్యంత నమ్మకస్తురాలు. ఢిల్లీ ఎడ్యుకేషన్ మోడల్ నిర్మాణంలో ఆమె కీలక పాత్ర పోషించారు. వివిధ కేసులతో ఆప్ సీనియర్ నేతలు జైలు పాలవగా అప్పటి వరకు వారు చూస్తున్న శాఖలను అతిశీ చేపట్టారు. ఢిల్లీ మంత్రిగా ప్రస్తుతం అతిశీ చేతిలో కీలకమైన విద్య, వైద్యం సహా మొత్తం 14 శాఖలు ఉన్నాయి. వీటితో పాటు ఢిల్లీ ప్రభుత్వంలో ఏకైక మహిళా మంత్రి కావడంతో వచ్చే ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకర్షించగలదని కేజ్రీవాల్ భావిస్తున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆతిషీ మర్లేనా 1981 జూన్ 8న విజయ్ సింగ్ - త్రిప్తా వాహీ దంపతులకు జన్మించారు. ఆమె తల్లిదండ్రులిద్దరూ వృత్తిరీత్యా ప్రొఫెసర్లు. ఆమె మొదటి పేరు మార్లేనా. 2018లో నేషనల్ ఎలక్షన్స్ కు ముందు తనపేరును ఆతిషిగా మార్చుకున్నారు. ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ నుంచి స్కాలర్ షిప్ పైనే మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిందామె. 2013లో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరిన ఆమె.. 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి.. సమీప బీజేపీ అభ్యర్థి ధరంబీర్ సింగ్ పై 11,422 ఓట్ల తేడాతో గెలిచారు. లిక్కర్ స్కామ్ కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, హెల్త్ మినిస్టర్ సత్యేంద్ర జైన్ లు అరెస్ట్ అవ్వడం, వారి రాజీనామాల పరిణామాల తర్వాత.. ఆతిషీకి కేబినెట్ లో చోటు దక్కింది. విద్య, స్త్రీ-శిశు సంక్షేమం, సంస్కృతి, పర్యాటకం, ప్రజా పనుల శాఖ మంత్రిగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు.

1998లో సుష్మా స్వరాజ్ 52 రోజుల పాటు తాత్కాలిక ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి షీలా దీక్షిత్ 3 పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఢిల్లీకి 1998 డిసెంబర్ 3 నుంచి 2008 నవంబర్ 30 వరకూ.. మూడుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో.. విజయం సాధించి 15 సంవత్సరాల 25 రోజులపాటు మహిళా సీఎంగా పనిచేసిన రికార్డు ఆమెకే సొంతం. ఇప్పుడు ఢిల్లీకి మూడవ మహిళా సీఎంగా ఆతిషీ నియామకం కానున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం మానుకోవాలి

హైదరాబాద్: ఎంతోమంది పోరాటం వల్ల స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కులాలు, మతాలకు అతీతంగా తెలంగాణ ప్రజలు ఉంటారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం మానుకోవాలని సూచించారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం యువత ఎదురుచూస్తున్నారని.. రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. రైతు భరోసా, పింఛన్ ఎప్పుడిస్తారన్నారు. రూ.2500 ఎప్పుడిస్తారని ఆడబిడ్డలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో శాంతి భద్రతలు దెబ్బతిన్నారని విమర్శించారు. ఒక్క నెలలో 30 హత్యలు అయ్యాయని పత్రికలు రాస్తున్నాయని చెప్పారు. హోం మంత్రిని పెట్టి శాంతిభద్రతలు కాపాడాలన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలం ముందు పెట్టుకుందాం అనుకుంటే అక్కడ రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని విమర్శించారు. గతంలో సోనియాగాంధీని బలిదేవత అని, రాహుల్ గాంధీని ముద్దపప్పు అని తిట్టాడు.. ఇప్పుడు వాటిని కవర్ చేసుకోవడానికే రాజీవ్ విగ్రహం పెట్టాడన్నారు. కంప్యూటర్‌ను రాజీవ్‌గాంధీ కనిపెట్టాడని రేవంత్ రెడ్డి అంటున్నారు. రాజీవ్ గాంధీ కంప్యూటర్ కనిపెట్టాడని రేవంత్ రెడ్డి చెప్తున్నాడు.. కంప్యూటర్ కనిపెట్టిన ఛార్లెస్ బాబేజ్ ఆత్మ ఎక్కడున్నా బాధపడుతుంది. మీకు తెలియదు, ఎవరైనా చెప్తే వినవంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పాలనే లేదు.. సెప్టెంబర్ 17ను ప్రజాపాలన అంటున్నాడని విమర్శించారు. ఇకనైనా పరిపాలనపై దృష్టిపెట్టాలని హితవు పలికారు. ఇచ్చిన 420 హామీలను నెరవేర్చే వరకు మిమ్మల్ని వదిలే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సకల మర్యాదలతో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీ భవన్‌కు పంపిస్తామన్నారు.

## చంద్రబాబు అక్రమ కట్టడంలో నివసిస్తున్నారు

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. అబద్ధాల రాజ్యానికి చక్రవర్తి చంద్రబాబు అని... ఇక ఆయన పరివారం ఎలా ఉంటుందో వేరే చెప్పక్కర్లేదని వ్యాఖ్యానించారు. సిగ్గు విడిచిన వ్యక్తికి తన తప్పు కనపడదన్నది నానుడి అని పేర్కొన్నారు. పాలకులకి ఒక న్యాయం పౌరులకు ఇంకొక న్యాయం ఉండదని... చట్టం ముందు అందరూ సమానులేనని వివరించారు. సీఎం చంద్రబాబే పర్యావరణపరంగా సున్నితమైన కృష్ణానది ఒడ్డుపై కట్టిన అక్రమ కట్టడంలో నివసిస్తున్నప్పుడు... బుడమేరు రివలెట్ పై ఇల్లు పగలగొట్టే నైతిక అధికారం ఆయనకు ఎక్కడుందని ప్రశ్నించారు. చంద్రబాబు నివసించే అక్రమ కట్టడం మొదట కూలగొట్టడం సముచితమని పేర్కొన్నారు. చంద్రబాబు అక్రమ నివాసాన్ని కూల్చాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. మరో ట్వీట్ ద్వారా విజయసాయి స్పందిస్తూ... ఏపీలో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇప్పటికీ ప్రతిపక్షం మాదిరే వ్యవహరిస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వాన్ని విమర్శించడం మానేసి పాలకపక్షంగా బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. భవిష్యత్తుపై ఎలాంటి విజన్ లేకుండా... గత ప్రభుత్వంపైనే పూర్తిగా ఫోకస్ చేస్తోందని మండిపడ్డారు. అధికారపక్షం మేలుకోవాలని... రాష్ట్ర ప్రజల కోసం పని చేయాలని హితవు పలికారు.

## త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు..!



హైదరాబాద్: జర్నలిస్టులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అనుభవం, అర్హత కలిగిన జర్నలిస్టులందరికి త్వరలో ఇళల స్థలాలు ఇస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా పాలసీ తీసుకొస్తామని వివరించారు. వరంగల్ నగరానికి సంబంధించి నాళాలు ఆక్రమణలు తొలగిస్తామని మంత్రి చెప్పారు. అలాగే బీపీఎల్ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు లో అర్హులైన పేదలను గుర్తించాలన్నారు. అక్టోబర్ 2 న కాళోజీ కళాక్షేత్రాన్ని సీఎం రేవంత్ ప్రారంభిస్తారని పొంగులేటి చెప్పారు. ఏమైనా పెండింగ్ పనులు ఉంటే.. పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. త్వరలో రేషన్ కార్డులు కూడా ఇస్తామని పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ ఇళ్ల పట్టాలను సీఎం రేవంత్ రెడ్డి జర్నలిస్టులకు పంపిణీ చేశారు. 1100 మంది జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల పట్టాలను ఇచ్చారు. ఇళ్ల స్థలాల పట్టాలు పొందిన వారిలో సీఎం రేవంత్ రెడ్డి పీఆర్ఓ అయోధ్య రెడ్డి కూడా ఉన్నారు. ఈ సొసైటీలోని జర్నలిస్టులకు స్థలాల కేటాయింపు ఏళ్ల తరబడి కోర్టులో ఉండగా రేవంత్ ప్రభుత్వం వచ్చాక ఈ సమస్య తీరిపోయింది. అయితే అక్రిడెషన్ ఉన్నవారికి మాత్రమే ఇళ్ల స్థలాలు ఇస్తున్నారు. డిజిటల్ మీడియాలో పని చేసేవారికి అక్రిడేషన్ ఇవ్వడం లేదు. దీంతో డిజిటల్ మీడియాలో పని చేసే జర్నలిస్టుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. డిజిటల్ మీడియాలో పని చేసే జర్నలిస్టులకు కూడా అక్రిడేషన్ ఇవ్వాలని డిమాండ్ ఉంది. చిన్న చిన్న యూట్యూబర్లు కూడా తాము జర్నలిస్టులమని చెప్పుకుంటున్నారు. అయితే ఒక సంస్థ ఉండి.. అందులో 20కి పైగా మంది పని చేస్తూ.. వారికి పీఎఫ్ ఖాతా ఉంటే.. ఆ సంస్థ జర్నలిస్టులకు అక్రిడేషన్ ఇవ్వాలని కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందా లేదా చూడాలి.

## తుపాను బీభత్సం.. మయన్మార్‌లో 226 మంది మృతి!



ఇంటర్నెట్ డెస్క్: భారీ వర్షాలతో మయన్మార్ అతలాకుతలమైంది. ఈ క్రమంలోనే యాగీ తుపాను విరుచుకుపడటంతో వరదలు పోటెత్తాయి. పెద్దఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో దాదాపు 226 మంది మృతి చెందారు. మరో 77 మంది గల్లంతైనట్లు అధికారిక మీడియా వెల్లడించింది. లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. దాదాపు 6.30 లక్షలమంది ప్రకృతి విపత్తుతో ప్రభావితమయ్యారని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఐరాస తెలిపింది. మయన్మార్‌లో ఇటీవలి సంవత్సరాల్లో అత్యంత దారుణమైన వరదలు ఇవేనని పేర్కొంది. అప్పటికే అంతర్యుద్ధంతో సతమతమవుతున్న మయన్మార్‌లో వరదల ధాటికి.. వేల ఎకరాల్లో పంట నాశనమైంది. రాజధాని నేపిడావ్ ప్రాంతం తీవ్రంగా ప్రభావితమైంది. దాదాపు ఐదు లక్షల మంది ప్రజలు ఆహారం, తాగునీరు, సరైన ఆశ్రయం లేక అల్లాడుతున్నట్లు ఐరాస తెలిపింది. రహదారుల వంటి మౌలిక సౌకర్యాలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని పేర్కొంది. ఈ క్రమంలోనే తమ దేశాన్ని ఆదుకోవాలని అక్కడి సైనిక పాలక వర్గం జుంటా విదేశీ సాయాన్ని అభ్యర్థించినట్లు తెలుస్తోంది. వియత్నాం, థాయ్‌లాండ్, లావోస్‌లలోనూ యాగీ తుపాను విధ్వంసం సృష్టించింది. ఒక్క వియత్నాంలోనే 300 మందిని బలితీసుకుంది.

### వైజాగ్ స్టీల్ ప్లాంట్ పై కేంద్రం ప్లాన్ ఇదే..
# తేల్చేసిన పురందేశ్వరి..!

అమరావతి: ఏపీకి కీలకమైన విశాఖ స్టీల్ ప్లాంట్ ను కేంద్రం త్వరలో ప్రైవేటీకరించనుందన్న వార్తలు కార్మికులు, ఉద్యోగుల్ని కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా గత కొన్ని రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో వారు విధులు బహిష్కరించి రోడ్లపైకి వస్తున్నారు. ప్లాంట్ పనిచేసేందుకు అవసరమైన ముడి సరుకు కొరత తీవ్రమవుతుండటం, మరోవైపు ఉద్యోగులను ప్రొబేషన్ పై ఇతర సంస్థలకు పంపడం చూస్తుంటే ప్రైవేటీకరణ తప్పదనే అభిప్రాయం వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఇవాళ రాజమండ్రిలో స్పందించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను ధ్వంసం చేయాలనే ఆలోచన కేంద్రానికి లేదని ఆమె తేల్చిచెప్పారు. స్టీల్ ప్లాంట్ ని కాపాడాలనే ఆలోచనే కానీ, లాభాల్లోకి తీసుకురావాలనే ఆలోచనే కానీ, ధ్వంసం చేసే ఆలోచన కేంద్రానికి లేదన్నారు. ఇప్పటికే కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్లాంట్ కు వచ్చి పరిశీలించి సానుకూలంగా స్పందించారని గుర్తుచేశారు. అయితే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగబోదన్న హామీ మాత్రం పురందేశ్వరి ఇవ్వలేదు. కేవలం స్టీల్ ప్లాంట్ కాపాడి, లాభాల్లోకి తెస్తామని మాత్రమే చెప్పారు. గతంలో కేంద్రం కూడా పలుమార్లు ఇదే విషయం చెప్పింది. స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరించడం ద్వారా అది పూర్తిగా మునిగిపోకుండా చూస్తామని మాత్రమే కేంద్రం గతంలో పార్లమెంట్ లోనూ వెల్లడించింది. దీంతో స్టీల్ ప్లాంట్ వ్యవహారంపై ఏం చేయాలనే దానిపై కూటమి పార్టీల్లోనూ టెన్షన్ పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

### వరద బాధితులకు అండగా వైఎస్సార్‌సీపీ..
# మూడో విడత సాయం పంపిణీ



విజయవాడ, సాక్షి: మూడో దశ వరద సహాయక కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ (మంగళవారం) శ్రీకారం చుట్టింది. విజయవాడ వరద బాధిత కుటుంబాలకు సరుకులు పంపిణీ చేస్తోంది. నిత్యావసర సరుకుల వాహనాలను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. మొత్తం 50 వేల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ తరపున నిత్యావసర సరుకుల పంపిణీ చేయనుంది. 33 డివిజన్లల్లో సరుకుల పంపిణీ జరగనుంది. వరద బాధితుల సహాయార్థం వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.కోటి విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ నెల జీతం విరాళంగా ప్రకటించారు. ఇప్పటికే రెండు దశల్లో వరద నీటిలో అవస్థలు పడ్డ బాధితులకు పాల ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను పంచగా.. ఇప్పుడు మూడో విడతలో నిత్యావసరాలు ఇస్తున్నారు.

## శ్రీ సిటీ పరిధిలోని (కిరాణ) దుకాణాలలో పోలీసుల తనిఖీలు



వరదయ్య పాలెం, (శుభోదయం న్యూస్ ): శ్రీ సిటీ పారిశ్రామిక వాడ పరిధిలో ఓ బెల్ట్ షాప్ నిర్వహిస్తూ... తమిళనాడు మద్యం అమ్ముతుండగా ఓ వ్యక్తిని అరెస్టు చేసిన సందర్భంగా సీరియస్ అయ్యారు డిఎస్పి- పైడేశ్వరరావు.శ్రీ సిటీలో దేశ విదేశాల పరిశ్రమలుబి వేల సంఖ్యలో దేశ విదేశీ కార్మికులు, ఉద్యోగస్తులు పనిచేస్తూన ఇలాంటి ప్రదేశంలో ఎల్లప్పుడు పోలీసుల నిఘ ఉంటుందని శ్రీ సిటీ పరిధిలో అక్రమ రవాణా అక్రమ అమ్మకాలు నిషేధిత మత్తు పదార్థాల అమ్మకాలు కఠిన చర్యలు చట్టపరంగా ఉంటాయని ఎంతటి వారైనా చర్యలు తప్పవనివ్యసనాలకు, జల్సాలకు బానిసలై సులువైన మార్గంలో డబ్బు సంపాదించే క్రమంలో శ్రీసిటీ పారిశ్రామిక వాడ ప్రతిష్ఠ కు భంగం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు...వేల కార్మికులకు ఉపాధి కల్పిస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపే కార్యక్రమం ఓవైపు శ్రీ సిటీ యాజమాన్యం కృషి చేస్తూ వందలాది కుటుంబాల లో ఆర్థిక వెలుగులు నింపుతూ వ్యాపార లావాదేవీలే కాకుండా పారిశ్రామిక వాడ పరిధిలో మరియు నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలవడం కోసం అహర్నిశలు కృషి చేస్తుంటే....మరోవైపు వారి ప్రతిష్టకు భగ్నం కలిగే విధంగా చేస్తున్న వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పౌర్ణమి వేళ లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమామహేశ్వర వ్రతం



వరదయ్య పాలెం, (శుభోదయం న్యూస్ ): వరదయ్యపాలెం మండలం, గోవర్ధనపురం నందు లోకా ఫౌండేషన్ కార్యాలయం నందు ఉమా మహేశ్వర వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక విభాగం ఆధ్వర్యంలో బుధవారం, భాద్రాపద మాసం,పౌర్ణమి, ఉమామహేశ్వర వ్రత పుణ్యదినమును పురస్కరించుకొని వరదయ్యపాలెం,గోవర్ధనపురం లోని లోకా ఫౌండేషన్ కార్యాలయ ఆవరణలో మృత్యుంజయ సహస్రనామ అష్టోతర పూజ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. మహాదేవుని దివ్యానుగ్రహానికి,పాప కర్మలనుండి



విముక్తులుకాగలరని, ఆయు ఆరోగ్య సంపాదలతో విలసిల్లగలరని అధ్యాత్మిక కో ఆర్డినేటర్ బొప్పన రమేష్ అన్నారు.పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు.పురోహితులు బొప్పన మోహన్,శ్రీనివాసులు, సహాయకులు సురేష్,గ్రామస్తులు బొప్పన చెంగల్రాయులు,అరుణ్ జి,దిలీప్,గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుని నిమజ్జనం...

### జంగాలపల్లె వైభవంగా పండరి

### భజనలు చెక్కభజనలు భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం





సిద్దవటం, సెప్టెంబర్ 18, (శుభోదయం న్యూస్): మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామపంచాయతీలో గణనాధునికి 12 రోజులు కఠోర పూజ కార్యక్రమాలు నిర్వహించి 13 రోజు పెన్నా నదిలో నిమజ్జనం చేశారు అనంతరం వినాయక ప్రతిమకు సహకరించిన నాయకులు పారిశ్రామికవేత్త అధికారి వెంకటయ్య అధికారి కృష్ణ దశరధరామనాయుడు దారపునేని రాజా నాయుడు సహకారంతో వినాయక ప్రతిభను ఏర్పాటు చేశామన్నారు అక్కడికి విచ్చేసిన భక్తులందరికీ నాగదాసరి విజయలక్ష్మి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీచర్ రమణయ్య పాల్గొన్నారు అనంతరం చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రంగురంగుల వేషధారణలో మునిగిపోయారు దారి పడవనా డీజేలు చెక్కభజనలు అలరించిపోయాయి సర్పంచ్ పాలెం వెంకటమ్మ సర్పంచ్ ప్రతినిధి శ్రీనివాసులు వెంకటసుబ్బయ్య నరసింహులు సుధీర్ సూరి నరసింహులు హరి సురేష్ సుధాకర్ మరికొందరు పాల్గొన్నారు.

## స్వచ్ఛత మీద ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి : డిపిఓ ప్రభాకర్ రెడ్డి




సిద్దవటం, (శుభోదయం న్యూస్): సిద్దవటం మండలంటక్కోలి గ్రామపంచాయతీ జిల్లా పరిషత్ హై స్కూల్ నందు బుధవారం జరిగిన స్వచ్ఛత కార్ విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం కల్పించారు ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు ఆయనకు రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి నాగ ముని రెడ్డి ఘనంగా శాలువతో మర్యాదపూర్వకంగా సత్కరించారు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమం పై విద్యార్థులకు గ్రామాలపై అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా మన చుట్టుపక్కల ప్రదేశాలు పరిశుభ్రంగా పెట్టుకోవాలని మన గ్రామంలో పచ్చదనంతో ఉండేటట్లు సహకరించాలని పొడి చెత్త, ఎండు చెత్త వేరువేరుగా సేకరించి గ్రీన్ అంబాసిడర్ వాహనంలో ప్రతి ఒక్కరూ వేయాలని చెత్త సేకరణ సేకరించి రైతుకు లాభసాటిగా మిశ్రమ ఎరువులు పంపిణీ చేసేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలియజేశారు ముఖ్యంగా గ్రామాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సూచన మేరకు అక్టోబర్ 2 తేదీ వరకు స్వచ్ఛత కార్యక్రమాలు ఉంటాయని గ్రామాలు అభివృద్ధి చెందిందుకు అవగాహన కార్యక్రమాలు ప్రతిరోజు మండల పరిధిలో కార్యక్రమాలు జరుగుతాయని తెలియజేశారు విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛత కార్యక్రమం పై మీ తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నేర్పించాలని తెలియజేశారు గ్రామాల్లో పచ్చదనం ఉండేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని దానివల్ల గ్రామాల్లో కాలుష్య నివారణకు ఉపయోగపడి గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు ప్రతి విద్యార్థి విద్యార్థిని శుభ్రత పాటించాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ ఉమామహేశ్వరుడు, స్వచ్ఛత ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ మానస, పంచాయతీ సెక్రటరీలు శివయ్య, సుదర్శన్ రెడ్డి తెదేపా నేతలు నాగ ముని రెడ్డి, చిన్నపురెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దేశంలో ఏ రాష్ట్రమూ ఇవ్వనటువంటి వరద నష్టపరిహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు

శాసనసభ్యులు బోండా ఉముకాల్వ శ్రీనివాసులు



విజయవాడ (శుభోదయం న్యూస్ ): సెంట్రల్ రిపోర్టర్ : తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఇటీవల సంభవించిన వరదల్లో నష్టపోయిన ప్రతి ఇంటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చరిత్రలో కానీ విని ఎరగని రీతిలో ఆర్థిక సాయం ప్రకటించిన నేపథ్యంలో నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించడం అయినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా:- సెంట్రల్ నియోజకవర్గం శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరావు, మరియు శాసనసభ్యులు కాల్వ శ్రీనివాసులు పాల్గొని నారా చంద్రబాబు, చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సంభవించినటువంటి వరదల దృష్ట్యా వరద బాధితుల సహాయార్థం పలు స్వచ్ఛంద సంస్థలు వాణిజ్య సంస్థలు రాజకీయ పార్టీలు వాసవి క్లబ్ నూటరీ క్లబ్ లయన్స్ క్లబ్ అందరూ కష్ట కాలంలో ముందుకొచ్చి వరద బాధితులకు తమకు తోచినంత సహాయం చేస్తూ ఉన్నారని సెంట్రల్ నియోజకవర్గంలో వరద బాధితులను ఆదుకోవడానికి తెలుగుదేశం పార్టీ అనేకమంది శాసనసభ్యులు ఇప్పటికే ఆహార కిట్లు, బట్టలు సరుకులు దుప్పట్లు అందజేశారని. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కుప్పం నుండి సహాయ సహకారాలు అందించారని నియోజకవర్గ వరద బాధితులను ఆదుకున్నటువంటి ప్రతి ఒక్కరికి నియోజకవర్గ శాసనసభ్యులుగా ధన్యవాదాలు తెలుపుతున్నానని. రాయదుర్గం శాసనసభ్యులు మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు దాదాపు 5వేల జీన్స్ ప్యాంట్లు వర్తక సంఘం తరపున 2000 మందికి ఈరోజు అందజేశామని నియోజకవర్గంలో లోని వరద బాధితులకు ఇప్పటివరకు ప్రభుత్వం తరపున పాలు, గుడ్లు, నీరు, భోజనం, టిఫిన్, బిస్కెట్ ప్యాకెట్స్, అందజేశామని. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు, విజయవాడ నగరంలో గ్రౌండ్ ఫ్లోర్లో మునిగిపోయినటువంటి కుటుంబాలకు 25వేల రూపాయలు, ఫస్ట్ ఫ్లోర్ అదనాపూర్ ఫ్లోర్లో వారికి పదివేల రూపాయలు, ఆర్థిక సహాయాన్ని ప్రకటించడం జరిగినదని.బుధవారం ఉదయాన్నే కలెక్టర్ను కలసి ఏదైతే వరద ఉధృతి సమయంలో ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయిన వారి వివరాలు నమోదు చేయలేదు తిరిగి మరల వివరాలు నమోదు ప్రక్రియ కొనసాగించాలని ప్రజల తరపున కోరడం జరిగినదని. కలెక్టర్ నియోజకవర్గ శాసనసభ్యులుగా తాను సీఎంఓ అధికారులను కలిసి వారిని కూడా రిక్వెస్ట్ చేస్తామని సెంట్రల్ నియోజకవర్గంలో చివరి వరద బాధితురుడిని ఆదుకునే వరకు తెలుగుదేశం ప్రభుత్వం నియోజకవర్గ ఎమ్మెల్యే గా తాను కృషి చేస్తానని తెలియజేస్తూ, గతంలో ఎన్నడూ కూడా ఇంత భారీ ఎత్తున ఆర్థిక సహాయం అందజేయలేదని గతంలో ఎప్పుడు 3000 నుండి 4 వేల రూపాయల వరకు మాత్రమే అందజేయడం జరిగిందని ఇంత పెద్ద ఎత్తున గ్రౌండ్ ఫ్లోర్ లోని ఇంటికి 25 వేల రూపాయలు ఇవ్వడం అనేది ఒక చరిత్రని పేదలను ఆదుకునేందుకు ఇంత ఉదారంగా ముందుకు వచ్చినటువంటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం, తెలుగు మహిళా, బీసీ ,ఎస్సీ ,ఎస్టీ నాయకుల ఆధ్వర్యంలో కాల్వ శ్రీనివాస్ కలసి పాలాభిషేక కార్యక్రమం నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని బోండా ఉమా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గరిమెళ్ళ చిన్న, దాసరి ఉదయశ్రీ, పైడి శ్రీను, లబ్బా వైకుంఠం, కోలా శ్రీనివాస్,

బంగారు నాయుడు, బెజవాడ తిరుపతి, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిడ్ డే మీల్స్ ఆకస్మిక తనిఖీ చేసిన డిపిఓ



సిద్దవటం, (శుభోదయం న్యూస్): సిద్దవటం మండలం టక్కోలి జిల్లా పరిషత్ హై స్కూల్లో బుధవారం మధ్యాహ్నం జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి విద్యార్థిని విద్యార్థులకు అందిస్తున్న మిడ్ డే మిల్స్ ఆకస్మిక తనిఖీ చేశారు జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన భోజనం విద్యార్థులకు అందించే విధంగా అన్ని ఏర్పాటు చేసిందని నాణ్యత లోపం లేకుండా చూడాలని స్కూల్ హెడ్మాస్టర్ కు తెలియజేశారు మధ్యాహ్న భోజనం చార్ట్ ప్రకారం అందించాలని ఆయన సూచించారు ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని ప్రతి విద్యార్థి యూనిఫామ్ ధరించాలని తెలియజేశారు మిడ్ డే మీల్స్ నాణ్యత లోపం లేకుండా చూడాలని అన్నారు.

# ప్రభుత్వ ఇసుక డంపింగ్ యార్డ్ లో ఇసుక అక్రమ రవాణా

### 3 ఇసుక లారీలు,2 హిటాచిలి

### సీజ్, చేసిన మండల ఎస్టై చిరంజీవి





సిద్ధవటం, సెప్టెంబర్18, (శుభోదయం న్యూస్): ఇసుక డంపింగ్ యార్డ్ నందు మంగళవారం రాత్రి 9 గంటలకు ఎటువంటి ఇసుక రవాణా బిల్లులు లేకుండా అక్రమ రవాణా జరుగుతున్నట్లు సిద్ధవటం మండల ఎస్సై చిరంజీవికి సమాచారం రావడంతో3 ఇసుక లారీలు2 హిటాచీలు సీజ్ చేశారు జ్యోతి ఇసుక డంపింగ్ యార్డ్ నందు కొన్ని రోజులుగా ప్రభుత్వ ఖజానా గండి కడుతూ అక్రమ రవాణా జరుగుతున్నట్లు జోరుగా వదంతులు మొదలయ్యాయి మంగళవారం రాత్రి స్థానిక మండల ఎస్సై కి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో ఆ ప్రాంతానికి వెళ్లి వాహనాలు సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా మండల ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వ ఇసుక డంపింగ్ యార్డ్ లో ఎటువంటి పర్మిషన్ లేకుండా ఇసుక రవాణా జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆ ప్రాంతానికి వెళ్లి3 లారీలు2 హిటాచీలు స్వాధీనం చేసుకుని కోర్టుకు సమర్పిస్తున్నామని ప్రభుత్వ ఖజానా గండి కొడుతూ ఇలా చేయడం నేరమని ఆయన అన్నారు ఇసుక అక్రమ రవాణా జరకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఆయన అన్నారు.

## గణపతి లడ్డు వేలంపాటలో దక్కించుకున్న పాలెం రాజా కుటుంబీకులు



సిద్దవటం, సెప్టెంబర్18, (శుభోదయం న్యూస్): సిద్దవటం మండలం జంగాలపల్లె గ్రామం హరిజనవాడలో బుధవారం వినాయక నిమజ్జనం కార్యక్రమం సందర్భంగా 13 రోజులు వేద పండితులచే వివిధ రకాల పూజలు అందుకున్న గణేష్ లడ్డు వేలంపాటలో పాలెం రాజా కుటుంబీకులు 30 వేల రూపాయలకు దక్కించుకున్నారు వచ్చిన భక్తులకు స్వామివారి ప్రసాదంగా అన్న ప్రసాదాలు ఘనంగా ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు రమణయ్య మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్య లేకుండా అందరూ కలిసిమెలిసి కార్యక్రమం విజయవంతం చేశారని ఉత్సవాలకు సహాయ కార్యక్రమాలు చేసిన భక్తులకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు స్వామివారి నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక కోలాటాలు ఏర్పాటు చేశామని ప్రతి ఒక్కరు తిలకించాలని అన్నారు వచ్చే ఏడాది కూడా ఇలాగే అందరూ కలిసిమెలిసి చేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఒప్పిచర్ల విద్యార్థిని ఎంపిక



కారంపూడి మండలం, (శుభోదయం న్యూస్) :ఉమ్మడి ప్రకాశం జిల్లా పంగులూరు లో ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ ఖోఖో బాల బాలికల రాష్ట్ర జట్ల ఎంపికలు జరిగాయి. ఇందులో భాగంగా ఒప్పిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుచున్న పాశం. శివమణి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్ ఖో ఖో బాలికల జట్టుకు ఎంపికయిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ లలిత తెలిపారు.రాష్ట్ర జట్టుకు ఎంపికైన శివమణి ఈనెల 18 వ తేదీ నుండి 26 వ తేదీ వరకు కృష్ణా జిల్లా గుడివాడ లో శిక్షణ పొంది అనంతరం సెప్టెంబర్ 28 తేదీ నుండి అక్టోబర్ 2 వ తేదీ వరకు జార?ండ్ రాష్ట్రం లో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖో ఖో పోటీల్లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు చిన్న రత్తయ్య తెలియజేశారు.జాతీయ స్థాయికి ఎంపికైన శివమణి కి బుధవారం పాఠశాల లో జరిగిన అభినందన సభలో ఉపాధ్యాయులు ఆషా, దుర్గా దేవి, నిర్మల, రమాదేవి, అబ్దుల్ రఫీ, అంజిరెడ్డి, హనుమంతురావు, కిరణ్ కుమారి, సౌజన్య, సునీత, బలరాం, సీత మహాలక్ష్మి, సంధ్యా గార్లు మరియు విద్యార్థినీ, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## అందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛ సాకారం






రెంటచింతల(శుభోదయం న్యూస్): పరిశుభ్రతే లక్ష్యంగా 15 రోజులు పాటు నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం భద్రం అని ఈ సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలంలో పాల్గొన్న పలువురు వక్తలు పేర్కొన్నారు.బుధవారం స్థానిక సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో ఐటీసీ%ఉ% సెర్చ్ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న సీవో ఎం.గురుప్రసాద్ అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్రతి పౌరుడికి ఆరోగ్య రక్షణ కల్పించాలన్నదే ఈ కార్యక్రమం లక్ష్యం అని పేర్కొన్నారు.పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. మహాత్మా గాంధీ ఆశయ సాధనలో భాగంగా స్వచ్ఛ గ్రామాల రూపకల్పనకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలోఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్, రాంబాబు,శౌరయ్య తదితర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జిగా సుగవాసి

### మండల తెలుగు తమ్ముళ్ల సంబరాలు



సిద్దవటం, సెప్టెంబర్18, (శుభోదయం న్యూస్): సిద్దవటం మండలం భాకరాపేట నేషనల్ హైవే ఫారెస్ట్ చెక్ పోస్ట్ పక్కన ఉన్న కాడే చెంచయ్య నాయుడు నివాసం నందు రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జిగా సుగవాసి సుబ్రహ్మణ్యం నియామకంపై మండల తెలుగుదేశం పార్టీ శ్రేణులు బాణాసంచా పేలుస్తూ భారీగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి నాగ ముని రెడ్డి మాజీ సర్పంచ్ రాజశేఖర్ యాదవ్ ఆసుపత్రి అభివృద్ధి మాజీ సలహా కమిటీ మెంబర్ మల్లు వెంకట సుబ్బారెడ్డి రాజంపేట అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు అవ్వారు రాజారాం ఆకుల సుబ్బరాయుడు,ఎద్దుల శ్రీనివాసులు పార్ల శ్రీనివాసులు యాదవ్ ఓబులేసు శివ రామయ్య బాలినేని సుబ్బరాయుడు పుత్ర ఎల్లయ్య జెసిబి శివ జ్యోతి గంగానంద్ రెడ్డి తదితర కార్యకర్తలకు పాల్గొన్నారు ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కాడే చెంచయ్య నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా సుగవాసి బాల సుబ్రహ్మణ్యం నియమించడం శుభ పరిమనామని ఓడిన అభ్యర్థుల నియోజకవర్గ అభ్యర్థులే ఇన్చార్జిలుగా కొనసాగుతారని సమావేశంలో అధినాయకత్వం పార్టీ కార్యక్రమాలపై మాట్లాడడం చాలా సంతోషకరమని అన్నారు సుగువాసి కుటుంబం ఎప్పటినుండో రాజకీయాల్లో స్థిరపడ్డ కుటుంబమని ఆయన అన్నారు రాష్ట్రంలో ఓడిన అభ్యర్థులకు ఇన్చార్జ్ చేయడం ఆనవాయితిగా తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ ఉందని ఇప్పుడు కూడా అదే జరిగిందని పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు.

## వరద బాధితుల సహాయార్థం 4.5 లక్షల విరాళాలు...



కందుకూరు ఆర్సీ ఇంచార్జ్, (శుభోదయం న్యూస్):కందుకూరు శాసనసభ్యులు శ్రీ ఇంటూరి నాగేశ్వరరావు పిలుపుతో... విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు నాయకులు, కాంట్రాక్టర్లు, వివిధ సంస్థల ప్రతినిధులు విరాళాలు అందిస్తున్నారు. కందుకూరులోని విద్యాసంస్థల మేనేజ్ మెంట్, టీచర్లు, విద్యార్థులు కలిపి 2,76,063 రూపాయలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి ఈరోజు అందజేశారు. కొంతమంది విద్యార్థులు తమ పాకెట్ మనీని విరాళంగా ఇచ్చారని విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర్ వివరించగా... ఆ చిన్నారులను ఎమ్మెల్యే పలకరించి మాట్లాడి ప్రత్యేకంగా అభినందించారు.గుర్రంవారిపాలెంకు చెందిన టిడిపి నాయకుడు దామా వెంకటేశ్వర్లు లక్ష రూపాయలు విరాళాన్ని అందించారు.అలాగే కందుకూరు మండలం పందలపాడు గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ రామాల వెంకటకృష్ణారెడ్డి 50వేలు, కందుకూరు పట్టణానికి చెందిన సత్యసాయి జ్యుయెలర్స్ అధినేత కాకుమాని ప్రవీణ్ కుమార్ 25 వేల రూపాయలు విరాళాన్ని ఎమ్మెల్యేకు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్ద మనసుతో వరద బాధితులకు సాయమందిస్తున్న దాతలందరికీ అభినందనలు తెలిపారు. బాధితుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు భారీ పరిహారం ప్రకటించి వారిని ఆదుకుంటున్నారని అన్నారు. ప్రజలను కన్నబిడ్డల్లాగా చూసుకునే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం, మన రాష్ట్రానికి గొప్పవరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాలభాస్కర్, నరేంద్ర, డీన్ మందలపు రామారావు, ప్రిన్సిపల్స్ నజీర్, మల్లికార్జున, ఇంకా ఉపాధ్యాయ సిబ్బంది మరియు ఆర్యవైశ్య ప్రముఖులు మురారి శెట్టి సుధీర్, చక్కా వెంకట కేశవరావు, కోట కిషోర్, గొత్తుల బాలాజీ, పువ్వాడి నరసింగరావు, తాతా లక్ష్మీనారాయణ, కంకణాల వెంకటేశ్వర్లు, చలంచర్ల రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## చెడు వ్యసాలనాలనుంచి దూరంగా ఉంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది

### ప్రముఖ వైద్యులు సందిప్



యర్రగొండపాలెం, (శుభోదయం న్యూస్ ) : మనిషి మంచి ఆలవాట్లు అలవరచుకొని చెడు వ్యసాలనాలనుంచి దూరంగా ఉంటే గుండె ఆరోగ్యంగా ఉంటుందని ప్రముఖ వైద్యులు సందిప్ అన్నారు.




యర్రగొండపాలెం పట్టణంలోని ఉదయ్ రవీంద్ర కార్పోరెట్ ఆసుపత్రిలో ల్యాండ్ మార్క్ ఫార్మాసి కంపేనీ వారి ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది , ఈ అవగాహన సదస్సుకు డా సందీప్ ,డా సుజాత ముఖ్యఅతిదులుగా పాల్గొన్నారు , ఈ సందర్బంగా సందిప్ మాట్లాడుతూ ......మనిషి మంచి ఆలవాట్లతో , చెడువ్యసానాలకు దరంగా మసిలినప్పుడే మనిషి గుండే ఆరోగ్యంగా ఉంటాడని అన్నారు ..... ఆరోగ్యహక్కు అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని దాన్ని ద్రుష్టిలో ఉంచుకొని మనిషి తమ ఆరోగ్యం గురించి శ్రద్దవహించాలని కోరారు ....ఈ కార్యాక్రమంలో డా ,సుజాత , డా ,నారయణ రెడ్డి ,ల్యాండ్ ఫార్మాసి సెల్స్ మెనేజరు అస్లామ్ ఖాన్ ,ప్రతిప్ కూమార్ తదితరులు ఉన్నారు.

## గణపతి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఆది మూలపు సురేష్!



శుభోదయం న్యూస్ టంగుటూరు తేదీ: 18-9-24 (బుధవారం) :- టంగుటూరు మండల పరిధిలోని కొనిజెడు గ్రామంలో బుధవారం జరిగిన, గణపతి ప్రత్యేక పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి, కొండేపి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త డాక్టర్ అదిమూలపు సురేష్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆ గణపతి దేవుని కరుణాకటాక్షాలు ఎల్లవేళలా ప్రజలందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## పొందూరులో కాంఎం ఏచూరికి ఘనంగా నివాళులు!



టంగుటూరు, (శుభోదయం న్యూస్): టంగుటూరు మండల పరిధిలోని పొందూరు గ్రామంలో బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో దివంగత నేత సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కాంఎం సీతారామ్ ఏచూరికి పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి తన జీవితాంతం పీడిత ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మోజెస్, స్థానిక గ్రామ కార్యదర్శి సింగయ్య, మీరస్ తదితర పార్టీ కార్యకర్తల, అభిమానులు పాల్గొనడం జరిగింది.

## ఈనెల 22న మాజీ మంత్రి స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సభ!

### ఈ సందర్భంగా 'మెగా జాబ్ మేళా' మరియు 'ఉచిత వైద్య శిబిరం'

టంగుటూరు, (శుభోదయం న్యూస్): మాజీ మంత్రి స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు 17వ వర్ధంతి సభ ఈనెల 22వ తేదీ ఆదివారం ఆయన స్వగ్రామమైన మండల పరిధిలోని తూర్పు నాయుడుపాలెం గ్రామంలో జరుగుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత మెగా వైద్య శిబిరం మరియు నిరుద్యోగ యువతీ యువకులకు మెగా జాబ్ మేళా కార్యక్రమలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం తెచ్చేసుకోవాలని అన్నారు. ఇదిలా ఉండగా ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలకు సంబంధించిన పలువురు మంత్రులతో పాటు వివిధ నియోజకవర్గాల శాసనసభ్యులు పాల్గొంటారని సత్య తెలిపారు.

## పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



నల్లచెరువు, (శుభోదయం న్యూస్): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ను బుధవారం కదిరి నూతన డి.ఎస్.పి శివ నారాయణ స్వామి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.కదిరికి నూతనంగా రావడంతో తన పరిధిలోకి వచ్చు పోలీస్ స్టేషన్లన్నింటిని తనిఖీ చేశారు.ఇందులో భాగంగా బుధవారం మండల కేంద్రంలో నల్లచెరువు పోలీస్ స్టేషన్లు తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కేటాయించిన విధులు,పనితీరును ఆరా తీశారు.పెండింగ్ కేసులపై నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ తనిఖీలు డి.ఎస్.పి వెంట కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, స్టేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బాల్య వివాహరహిత భారతదేశమే లక్ష్యం




నల్లచెరువు, (శుభోదయం న్యూస్) : బాల్య వివాహరహిత భారతదేశమే లక్ష్యమని రూరల్ ఎన్విరాన్మెంట్ డెవలప్మెంట్ సొసైటీ (రెడ్స్) సమస్త



కోఆర్డినేటర్ గిరిజ పేర్కొన్నారు.బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో బాలల అక్రమ రవాణా,బాల్య వివాహాలు, అత్యాచారాలు ఎక్కువయ్యాయన్నారు. బాల్య వివాహాలు జరగడం వల్ల భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య సమస్యలు తదితర వాటిని విద్యార్థులకు వివరించారు.వీటిని నిర్మూలించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్న వివిధ మండలాల్లో ఆడపిల్లలు అక్రమ రవాణా జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు.దీనిని నిర్మూలించడం కోసం ఆడపిల్లలు అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు చెప్పే మాటలకు మోసపోకుండా జాగ్రత్తగా పడాలన్నారు. ఆడపిల్లలు ఎక్కడికి ఒంటరిగా వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్.ఓ. శిరీష శ్రీ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నారాలోకేష్ కు విరాళాలు అందజేసిన ఎమ్మెల్యే ఇంటూరి



కందుకూరు ఆర్సీ ఇంచార్జ్, (శుభోదయం న్యూస్):రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ ని, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఈ సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు.విజయవాడ వరద బాధితుల కోసం, కందుకూరు నియోజకవర్గానికి చెందిన పలువురు దాతలు విరాళంగా ఇచ్చిన 8,11,063 రూపాయలను చెక్కు రూపంలో లోకేష్ కి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను, వారిని ప్రోత్సహించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావును లోకేష్ ప్రత్యేకంగా అభినందించారు. విపత్తులు వచ్చిన పరిస్థితుల్లో అందరం బాధితుల పక్షాన నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ, చిత్తశుద్ధితో బాధితులకు అన్ని విధాలుగా మేలు చేకూర్చిందని అన్నారు. విరాళాలు ఇచ్చిన ప్రతి దాతకు ప్రభుత్వం తరపున, తన తరపున ధన్యవాదాలు తెలియజేసినట్లు చెప్పాలని నాగేశ్వరరావుకు లోకేష్ సూచించారు.ఇంకా నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపైనా ఇద్దరి మధ్య చర్చ జరిగింది.

## రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జిగా సుగవాసి

### మండల తెలుగు తమ్ముళ్ల సంబరాలు



సిద్ధవటం, (శుభోదయం న్యూస్) : సిద్ధవటం మండలం భాకరాపేట నేషనల్ హైవే ఫారెస్ట్ చెక్ పోస్ట్ పక్కన ఉన్న కాడే చెంచయ్య నాయుడు నివాసం నందు రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జిగా సుగవాసి సుబ్రహ్మణ్యం నియామకంపై మండల తెలుగుదేశం పార్టీ శ్రేణులు బాణాసంచా పేలుస్తూ భారీగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి నాగ ముని రెడ్డి మాజీ సర్పంచ్ రాజశేఖర్ యాదవ్ ఆసుపత్రి అభివృద్ధి మాజీ సలహా కమిటీ మెంబర్ మల్లు వెంకట సుబ్బారెడ్డి రాజంపేట అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు అవ్వారు రాజారాం ఆకుల సుబ్బరాయుడు,ఎద్దుల శ్రీనివాసులు పార్ల శ్రీనివాసులు యాదవ్ ఓబులేసు శివ రామయ్య బాలినేని సుబ్బరాయుడు పుత్త ఎల్లయ్య జెసిబి శివ జ్యోతి గంగానంద్ రెడ్డి తదితర కార్యకర్తలకు పాల్గొన్నారు ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కాడే చెంచయ్య నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా సుగవాసి బాల సుబ్రహ్మణ్యం నియమించడం శుభ పరిమనామని ఓడిన అభ్యర్థుల నియోజకవర్గ అభ్యర్థులే ఇన్చార్జిలుగా కొనసాగుతారని సమావేశంలో అధినాయకత్వం పార్టీ కార్యక్రమాలపై మాట్లాడడం చాలా సంతోషకరమని అన్నారు సుగువాసి కుటుంబం ఎప్పటినుండో రాజకీయాల్లో స్థిరపడ్డ కుటుంబమని ఆయన అన్నారు రాష్ట్రంలో ఓడిన అభ్యర్థులకు ఇన్చార్జ్ చేయడం ఆనవాయితిగా తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ ఉందని ఇప్పుడు కూడా అదే జరిగిందని పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు

## గ్రామ వాలంటీర్లను ఆదుకోండి




స్టేట్ బ్యూరో (శుభోదయం న్యూస్): గ్రామ వాలంటీర్ల వ్యవస్థను కొనగించాలని అల్లూరి జిల్లా అధ్యక్షుడు కొమ్మ రాంబాబు, కొండబాబు హుకుంపేట ఇవోపిఆడి మేమురాండం అందజేశారు . ఆయన మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించి పది వేల వేతనం పెంచుతామని హామి ఇచ్చారని చెప్పారు. సీఎం ఇచ్చిన హామిని నిలబెట్టి వాలంటీర్లను విధుల్లో తీసుకోవాలని చెప్పారు. తక్షణమే వాలంటీర్లు వీధుల్లో తీసుకొని మూడు నెలల బకాయి వేతనాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వం కోరారు. వాలంటీర్లను కొనసాగిస్తే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలను ప్రజల చెంతకు చేరే విధంగా కృషి చేస్తామని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిబిఐటి ఆచార్యలకు అభినందనలు





హైదరాబాద్, (శుభోదయం న్యూస్ ): 57వ ఇంజనీర్స్ డే సందర్భంగా ( భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జన్మదిన సందర్భంగా) ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (భారతదేశం), తెలంగాణ రాష్ట్ర కేంద్రం ఈ నెల 15నాడు విద్యాపరంగా మరియు పరిశోధనలో చేసిన కృషికి గుర్తింపుగా అవార్డు ఇచ్చారు. ఇంజినీరింగ్ రంగం లో సిబిఐటి ఈసిఈ విభాగ ప్రొఫెసర్ డి కృష్ణ రెడ్డి కి ఇంజినీరింగ్ ఆఫ్ ది ఇయర్ అవార్డు 2024 మరియు "యంగ్ ఇంజినీర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ - 2024" క్రింద మెకానికల్ ఇంజనీరింగ్ విభాగ సహాయ ఆచార్యుడు డాక్టర్ రాహుల్ కి అవార్డు వచ్చినందుకు ఈ రోజు చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సివి నరసింహులు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రభాకర్ రెడ్డి, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ వసంత్ మరియు ఇతర సిబ్బంది వారిని అభినందించారు.

## జనసేన గూటికి బాలినేని..! నేడు పవన్ కళ్యాణ్‌తో భేటీ



**అమరావతి,:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి అడుగులు జనసేన పార్టీ వైపు పడుతున్నాయి.. ఇప్పటికే తన రాజీనామా లేఖలో పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి పంపిన బాలినేని.. అందులో కీలక అంశాలను ప్రస్తావించారు.. ఇక, జనసేన పార్టీ నేతలతో టచ్‌లోకి వెళ్లారట బాలినేని.. రేపు విజయవాడలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో భేటీ కానున్నారట బాలినేని.. నిన్న జనసేన కీలక నేత నాగబాబుతో మంతనాలు కూడా జరిపారని తెలుస్తోంది.. గత కొద్దిరోజులుగా వైఎస్ జగన్ పై తీవ్ర అసంతృప్తిగా ఉన్న బాలినేని.. పార్టీలో తనకు ప్రాధాన్యత తగ్గిపోయిందన్న అభిప్రాయంతో ఉన్నారట.. అందులో భాగంగానే ఇప్పటికే తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు పంపిన బాలినేని.. అయితే, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో భేటీ అనంతరం జనసేనలో ఎప్పుడు చేరతారనే అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.. వైఎస్ కుటుంబంతో మంచి అనుబంధం.. బంధుత్వం ఉన్న నేత బాలినేని శ్రీనివాస్ రెడ్డి.. కొద్ది రోజులుగా అధిష్టానంపై అసంతృప్తితో ఉన్నారు.. ఐదు సార్లు ఒంగోలు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన బాలినేని.. సీనియర్ రాజకీయ నేతగా ఉన్నారు.. 2014లో వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు.. అయితే, 2019లో మళ్లీ గెలిచి వైసీపీ ప్రభుత్వం తొలి రెండున్నరేళ్లు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.. ఇక, మంత్రి పదవి నుంచి తొలగించడంతో తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు బాలినేని.. మరోవైపు, గత ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంట్ టికెట్ విషయంలోనూ వైఎస్ జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకించి వార్తల్లో ఎక్కారు.. ఎన్నికలకు ముందు నుంచే బాలినేని.. అసంతృప్తితో ఉన్నారనే చర్చ సాగినా.. ఇప్పుడు కూడా తన ప్రాధాన్యత దక్కడంలేదంటూ ఆయన వైసీపీకి గుడ్‌బై చెప్పేశారు. ఇక, రాజీనామా లేఖలో సంచల విషయాలు రాసుకొచ్చారు బాలినే.. కొన్ని కారణాల రీత్యా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మరియు పార్టీ సభ్యత్వానికి రాజీనా చేస్తున్నాను.. రాష్ట్ర ప్రగతి పథంలో వెళ్తే ఖచ్చితంగా రాజకీయాలకు అతీతంగా అభినందిస్తాను.. కారణం అంతిమంగా ప్రజాశ్రేయస్సే రాజకీయాలకు కొలమానం కదా? అని ప్రశ్నించారు.. విలువలను నమ్ముకొనే దాదాపు ఐదు సార్లు ప్రజాప్రతినిధిగా, రెండు సార్లు మంత్రిగా పనిచేశాను అన్న తృప్తి. కొంత గర్వం కూడా ఉందన్న ఆయన.. రాజకీయాలు వేరు, బంధుత్వాలు వేరు.. వైఎస్ఆర్ కుటుంబానికి సన్నిహితుడిని అయినా.. ఇప్పుడు జగన్ మోహన్ రెడ్డిని రాజకీయ నిర్ణయాలు సరిగా లేనప్పుడు ఖచ్చితంగా అడ్డుకొన్నాను అని స్పష్టం చేశారు.. ఎలాంటి మోహమాటాలకు నేనే పోలేదు.. అంతిమంగా ప్రజా తీర్పును ఎవరైనా హుందాగా తీసుకోవాల్సిందే.. నేను ప్రజా నాయకుడిని. ప్రజల తీర్పే నాకు శిరోధార్యం.. రాజకీయాల్లో భాష గౌరంగా హుందాగా ఉండాలని నమ్మే నిఖార్సైన రాజకీయం నేను చేశాను అంటూ తన రాజీనామా లేఖలో పేర్కొనడంతో.. వైసీపీలో జరుగుతోన్న పరిణామాలను ఆయన తప్పుబట్టారు.

## మోడీ, షాకి మాత్రమే ఇబ్బంది..
## జమిలి ఎన్నికలపై స్పందించిన ఒవైసీ



హైదరాబాద్: 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' ప్రతిపాదనకు మోడీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనిపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ తన నివేదికను రాష్ట్రపతికి సమర్పించింది. రెండు దశల్లో ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ఈ కమిటీ సూచించింది. ఈ కమిటీ నివేదికను కేబినెట్ బుధవారం ఆమోదించింది. 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' అంశంపై పలువురు విపక్ష నేతలు ఇది ఆచరణాత్మకం కాదని అన్నారు. కొందరు నేతలు దీనిపై సానుకూలంగా స్పందించారు. కేబినెట్ ఆమోదం పొందిన తర్వాత కాంగ్రెస్‌తోపాటు పలు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. దీనిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. దేశ ప్రజలు దీన్ని అంగీకరించబోరని అన్నారు. ఎన్నికల సమస్యలు సృష్టించి ప్రజలను మళ్లిస్తున్నారని ఆరోపించారు. 'ఒక దేశం-ఒకే ఎన్నికలు' ఆచరణాత్మకం కాదని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా స్పందించారు. ఎక్స్ వేదికగా స్పందించిన ఎంపీ ఇలా రాసుకొచ్చారు. "దేశంలోని ఫెడరలిజాన్ని నాశనం చేయడంతోపాటు ప్రజాస్వామ్యాన్ని రాజీ పడేలా చేయడం వల్లే తాను ఒకే దేశం-ఒకే ఎన్నికలను వ్యతిరేకిస్తున్నానని అన్నారు. బహుళ ఎన్నికలు మోడీ, షాలకు తప్ప ఎవరికీ ఇబ్బంది కాదు. మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రచారం చేయాల్సిన అవసరం ఉన్నందున ఇలా చేస్తున్నారు. సక్రమంగా, ఎప్పటికప్పుడు ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రజాస్వామ్య జవాబుదారీతనం కూడా మెరుగుపడుతుంది." అని రాసుకొచ్చారు.

## 2028 నాటికి భారత అంతరిక్ష కేంద్రం!



**న్యూఢిల్లీ,:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 2028 నాటికి భారతదేశపు మొట్టమొదటి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని ప్రారంభించనుంది. ఈ మేరుక ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ గతంలో కూడా వెల్లడించారు. భారతీయ విజ్ఞాన సమ్మేళన్‌లో పాల్గొన్న ఆయన ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. తాజాగా ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఇస్రోకు సంబంధించిన పలు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఇందులో చంద్రయాన్-4, వీనస్ మిషన్, ఇండియన్ స్పేస్ స్టేషన్, తదుపరి తరం ప్రయోగ వాహనాలను అభివృద్ధి చేయడం వంటి ప్రతిపాదనలు ఉన్నాయి. ఇస్రో ఇప్పటికే చంద్రుడిపైకి మూడు మిషన్లను పంపింది. చంద్రయాన్ 3 చంద్రుడి ఉపరితలంపై ల్యాండర్, రోవర్‌ను విజయవంతంగా దింపింది. దీంతో పాటు వీనస్ మిషన్‌కు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదం పొందిన తర్వాత ఇస్రో వీటికి సంబంధించిన పనులను ప్రారంభించనుంది. ఇదిలా ఉండగా.. సోమనాథ్ గతంలో మాట్లాడుతూ.. "ప్రస్తుతమున్న లాంఛర్ సామర్థ్యాలతోనే 2028 కల్లా మన దేశ తొలి అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని భావిస్తున్నాం. ఇతర దేశాలు, సంస్థలు ప్రయోగాలు నిర్వహించేందుకు వీలుగా దాన్ని ప్రయోగశాలగా తీర్చిదిద్దాలనుకుంటున్నాం." అని పేర్కొన్నారు. ఆర్థిక కార్యకలాపాలకు అంతరిక్ష కేంద్రం దోహదపడేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం అంతరిక్షంలో రెండు స్పేస్ స్టేషన్లు ఉన్నాయి. మొదటిది అమెరికా నేతృత్వంలోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం. ప్రపంచంలోని శాస్త్రవేత్తలందరూ ఇక్కడికి వచ్చి పరిశోధనలు చేస్తున్నారు. రెండవ స్టేషన్ చైనాకు చెందిన చెందినది. త్వరలో భారత్ కి కూడా అంతరిక్ష కేంద్రం ఉంటుంది.

### ముఖ్యమంత్రి సహాయనిధికి కుమారి ఆంటీ విరాళం.. ఎంతంటే..!



హైదరాబాద్: ఇటీవల భారీ వర్షాల బీభత్సానికి తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురైన విషయం తెలిసిందే. అయితే.. ముంపు బాధితులను ఆదుకోవడానికి తమకు తోచినంత ముఖ్యమంత్రి సహాయనిధికి విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా కుమారి అంటీ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50వేలు విరాళం అందజేశారు. కుమారీ ఆంటీ తన కుమార్తెతో కలిసి సీఎం రేవంత్ రెడ్డికి రూ.50 వేల చెక్కును అందజేశారు. ఇదిలా ఉంటే.. ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.20లక్షలు విరాళం అందజేసింది టెక్నో పెయింట్స్ సంస్థ. జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని టెక్నో పెయింట్స్ డైరెక్టర్స్ ఆకునూరి శ్రీనివాస్ రెడ్డి, సీవీఎల్ఎన్ మూర్తి, అనిల్ కొండోత్ కలిసి చెక్ అందజేశారు. నిన్న టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి సీఎం సహాయనిధికి రూ.50 లక్షల విరాళం అందించారు. అంతేకాకుండా, చిరంజీవి తన కుమారుడు, నటుడు రామ్ చరణ్ తరపున మరో రూ.50 లక్షలను కూడా అందజేశారు. ఇదే కాకుండా.. నటుడు అలీ సీఎం సహాయనిధికి రూ. 3 లక్షలు విరాళంగా అందజేశారు.

## 'డిజీ' లాకర్‌తో సర్టిఫికెట్లు భద్రం

**డిసెంబర్ నాటికి అప్‌లోడ్ పూర్తిచేయాలని యూజీసీ నిర్ణయం**

**యూనివర్సిటీలకు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ**

**విశ్వవిద్యాలయాల్లో పైలెట్ ప్రాజెక్టులు షురూ**




హైదరాబాద్: ఇంటర్వ్యూకి వెళ్లే విద్యార్థి చేతిలో ఫైల్...అందులో విద్యాభ్యాసానికి చెందిన అన్ని సర్టిఫికెట్లు... అవన్నీ ఆర్డర్‌లో ఉన్నాయా లేదా? అని ముఖంలో కంగారు... అయితే.. ఇప్పటివరకూ ఉన్న పరిస్థితి ఏఐ సాంకేతికతతో మారబోతోందని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చెబుతోంది. మౌస్ క్లిక్‌తో క్లౌడ్‌కు కనెక్ట్ అవ్వడం... టెన్త్ దగ్గర్నుంచీ పీహెచ్‌డీ దాకా డిజిటల్‌గా చూసే విధానానికి నాంది పలుకుతోంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి 'డీజీ'లాకర్‌ను అందుబాటులోకి తేవాలని అన్ని యూనివర్సిటీలను యూజీసీ ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా మన రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలన్నీ ఇప్పటికే రంగంలోకి దిగాయి. పరీక్షల విభాగం సమన్వయంతో పైలెట్ ప్రాజెక్టులను మొదలు పెట్టాయి. ఇందులోని సవాళ్లను పరిశీలించిన తర్వాత మరికొన్ని నెలల్లో పూర్తిస్థాయిలో డిజీ లాకర్స్‌ను అందుబాటులోకి తేవాలని భావిస్తున్నాయి.

### ఎందుకీ లాకర్స్?

దీనిద్వారా విద్యార్థి సర్టిఫికెట్లన్నీ డిజిటల్‌గా పొందే వీలుంది. దీనివల్ల సాఫ్ట్‌వేర్ కంపెనీలు కూడా తేలికగా క్లౌడ్ ద్వారా సర్టిఫికెట్ల ధ్రువీకరణ చేయొచ్చు. నకిలీ సర్టిఫికెట్లు ఉండే అవకాశమే ఉండదు. విద్యార్థికి టెన్త్ క్లాస్ నుంచే ఒక యూనిక్ ఐడీ కోడ్ ఇస్తారు. దీనిద్వారా క్లౌడ్‌కు లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. అందులో పూర్తి సమాచారం అందిస్తారు. అక్కడినుంచి టెన్త్, ఇంటర్ బోర్డులు, యూనివర్సిటీలు సంబంధిత ఐడీకీ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేస్తాయి. డీజీ లాకర్ వ్యవస్థ కేంద్ర సమాచార మంత్రిత్వశాఖ ఆధీనంలో, పూర్తి సురక్షితంగా ఉంటుంది. దీంతో సర్టిఫికెట్లు దెబ్బతిన్నాయని, పోయాయని ఆందోళన పడాల్సిన అవసరమే ఉండదు. విదేశీలకు వెళ్లినా కేవలం యూఆర్ఎల్ లింక్ ద్వారా సర్టిఫికెట్లను పొందే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం 2024 పాస్ అవుట్ విద్యార్థుల సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత పదేళ్లలోపు చదివిన విద్యార్థుల సర్టిఫికెట్లు కూడా అందుబాటులోకి తేవడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనికి అయ్యే మొత్తం ఖర్చు కూడా యూజీసీ భరిస్తుందని వర్సిటీ అధికారులు తెలిపారు.

### ప్రాక్టికల్‌గా ఎన్నో సవాళ్లు..

డిజీ లాకర్ వ్యవస్థను అందుబాటులోకి తేవడానికి ప్రాక్టికల్‌గా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. విద్యార్థుల ఆధార్ నంబర్‌ను దీనికి అనుసంధానం చేయాల్సి ఉంటుంది. అయితే, ఆధార్‌కు ఏ ఫోన్ నెంబర్ ఇచ్చారో... దాన్నే లాకర్‌కు ఇవ్వాలి. కానీ విద్యార్థుల్లో చాలామంది తరచూ ఫోన్ నెంబర్లు మారుస్తున్నారు. దీనివల్ల సమస్యలు వస్తున్నాయని జేఎన్‌టీయూహెచ్ పరీక్షల విభాగం అధికారి సాహూ తెలిపారు. మరోవైపు టెన్త్, ఇంటర్ బోర్డులతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుందని, దీనికి ప్రత్యేక యంత్రాంగం ఇప్పటివరకూ లేదని ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. ఉన్నత విద్యా మండలి నేతృత్వంలో జరిగే దోస్త్ డేటాను కూడా తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

### డిజీ లాకర్ ఎలా పనిచేస్తుంది?

విద్యార్థి అన్ని సర్టిఫికెట్లు ఒక క్లౌడ్ ద్వారా నిక్షిప్తం చేస్తారు. విద్యార్థి డీజీ లాకర్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటాడు. డీజీ లాకర్ విభాగం ఇచ్చే లాగిన్ పాస్‌వర్డ్‌ను మార్చుకుని భద్రపర్చుకుంటాడు. అవసరమైన సర్టిఫికెట్లను తను ఇంటర్వ్యూ లేదా అడ్మిషన్ పొందే సంస్థలకు మౌస్‌క్లిక్ లింక్ ద్వారా పంపుకోవచ్చు. యాక్సెస్ ఇవ్వడం ద్వారా ఆయా సంస్థలు సర్టిఫికెట్లన్నీ ఆన్‌లైన్‌లోనే తనిఖీలు నిర్వహిస్తాయి.

### ఒక విభాగాన్ని పరిశీలిస్తున్నాం

డిజీ లాకర్‌కు విద్యార్థుల డేటాను డిసెంబర్ నాటికి అప్‌లోడ్ చేయమని యూజీసీ తెలిపింది. ఇందులో భాగంగా పరీక్షల విభాగం సమన్వయంతో పైలెట్ ప్రాజెక్టు మొదలు పెట్టాం. ఎదురయ్యే సవాళ్లను పరిశీలిస్తున్నాం. విద్యార్థులకు ఇది ఉపయుక్తమైన ప్రాజెక్టు. అయితే, తొలి దశలో అనేక సమస్యలను అధిగమించాల్సి వస్తోంది. - డాక్టర్ కె.విజయకుమార్ రెడ్డి (రెక్టార్, జేఎన్‌టీయూహెచ్)

### తొలుత పీజీ విద్యార్థుల సమాచారం

డిజీ లాకర్ పరిధిలో తొలి విడతగా పీజీ విద్యార్థుల సమాచారం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇందులో ఎదురయ్యే ఇబ్బందులను పరిశీలించి తర్వాత దశకు వెళ్తాం. విద్యార్థుల సర్టిఫికెట్లు సురక్షితంగా, తేలికగా పొందేందుకు డీజీ లాకర్ తోడ్పడుతుంది.

## హైదరాబాద్‌లో ఇక ఎలక్ట్రిక్ బస్సులే!

**2,700 బస్సుల కోసం మూడు కంపెనీలతో ఆర్టీసీ చర్చలు**

**జీసీసీ పద్ధతిలో నిర్వహణ బాధ్యతలు**

**కి.మీ. అద్దె రూ.60గా ఉండే అవకాశం**

**దశలవారీగా ఏడాదిన్నరలో బస్సులు సమకూరే వీలు**




హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో డీజిల్ బస్సులు లేకుండా పూర్తిగా బ్యాటరీ బస్సులే నడిపేలా ఆర్టీసీ కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం 2,700 ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చుకునేందుకు, దేశంలోనే ప్రధాన బ్యాటరీ బస్సు తయారీ సంస్థలతో చర్చలు మొదలుపెట్టింది. మూడు కంపెనీలను సంప్రదించిన ఆర్టీసీ అధికారులు, వాటికి నిర్వహణ బాధ్యతలు అప్పగించే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు బ్యాటరీ బస్సుల నిర్వహణను.. ఒక్కో దఫాలో ఒక్కో కంపెనీకి అప్పగిస్తూ వస్తున్నారు. ఇప్పుడు ఒకేసారి పెద్దసంఖ్యలో బస్సులు సమకూర్చుకోవాల్సి ఉన్నందున, ఒకే కంపెనీకి కాకుండా మూడు కంపెనీలకు బాధ్యత అప్పగించాలని భావిస్తున్నారు.

### గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ మోడల్‌తో..

ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు 2,700 బస్సులు తిరుగుతున్నాయి. వీటిల్లో ఎలక్ట్రిక్ బస్సులు వందలోపే ఉన్నాయి. మిగతా అన్నీ డీజిల్ బస్సులే. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని మొత్తం బ్యాటరీ బస్సులనే వాడాలని ఇటీవల జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్టీసీని ఆదేశించారు. ఈమేరకు ఏర్పాట్లు ప్రారంభించారు. అయితే ఒక్కో బస్సు ధర రూ.1.85 కోట్లు ఉన్నందున, 2,700 బ్యాటరీ బస్సులను సంస్థ సొంతంగా కొనడం దాదాపు అసాధ్యం. దీంతో గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) పద్ధతిలో ప్రైవేటు సంస్థల నుంచి అద్దెకు తీసుకోవాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఒలెక్ట్రా, జేబీఎం కంపెనీల నుంచి కొన్నింటిని జీసీసీ పద్ధతిలో నిర్వహిస్తోంది. ఇటీవలే జేబీఎం నుంచి తీసుకున్న బస్సులకు ఒక కిలోమీటరుకు ఆర్టీసీ రూ.57.90 చొప్పున అద్దె చెల్లిస్తోంది. ఇప్పుడు కొత్తగా తీసుకునే బస్సులకు ఈ మొత్తం రూ.60 దాటే అవకాశం ఉంది. ఈ పద్ధతిలో తీసుకునే బస్సుల్లో ఆ కంపెనీలే డ్రైవర్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కండక్టర్లను మాత్రం ఆర్టీసీ ఏర్పాటు చేస్తుంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న బస్సుల్లో కండక్టర్ల ఖర్చు కిలోమీటరుకు రూ.18 ఉంటోంది. రూ. 60 అద్దె అనుకున్నా.. కండక్టర్ల ఖర్చుతో కలుపుకొంటే ఆ మొత్తం రూ.78 వరకు చేరుతుంది. మహిళలకు ఉచిత ప్రయాణ వసతి అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగిన విషయం తెలిసింది. ప్రస్తుతం ఆక్యుపెన్సీ రేషియో 100 శాతాన్ని దాటింది. ఈపీకే (కి.మీ.కు ఆదాయం) రూ.90గా ఉంటోంది. కండక్టర్ల వేతనం ప్లస్ బస్సుల అద్దె కలిపి రూ.78 కాగా.. ఈపీకే రూ.90గా ఉండటంతో ఆర్టీసీకి మార్జిన్ కి.మీ.కు రూ.12 వరకు ఉంటుంది. ఇందులో నిర్వహణ ఖర్చులు సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇది ఆర్టీసీకి పెద్ద నష్టం కాబోదని అధికారులు భావిస్తున్నారు.

### 3 వేలు దాటనున్న బ్యాటరీ బస్సులు..

హైదరాబాద్‌లో నడిపేందుకు వీలుగా ఆర్టీసీ ఇప్పటికే ఐదొందల బ్యాటరీ బస్సులకు ఆర్డరిచ్చింది. దశలవారీగా అవి సమకూరనున్నాయి. ఇప్పుడు మరో 2,700 బస్సులకు కొత్తగా ఆర్డరిస్తే.. మొత్తం ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య 3 వేలను మించనుంది. దశలవారీగా మరో ఏడాదిన్నరలో అవి అందే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## సూక్ష్మ సేద్యం అమల్లో ఏపీకి ఆరో స్థానం

**గత ఐదేళ్లలో రాష్ట్రంలో 3.09 లక్షల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం విస్తరణ**

**తద్వారా 2,73,888 మంది అన్నదాతలకు ప్రయోజనం**

**రైతులకు డ్రిప్ పరికరాలు కూడా ఇవ్వలేదని ఇన్నాళ్లూ టీడీపీ ప్రచారం**

**అదంతా అవాస్తవమేనని స్పష్టం చేస్తోన్న కేంద్ర గణాంకాలు**



అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు సూక్ష్మ సేద్యం పరికరాలు కూడా ఇవ్వలేదని టీడీపీ నేతలు చేస్తోన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించిన గణాంకాల ద్వారా స్పష్టమైంది. గత ఐదేళ్లలో సూక్ష్మ సేద్యం అమల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో నిలిచింది. గత ఐదేళ్లలో ఏపీ ప్రభుత్వం 3.09 లక్షల హెక్టార్లలో సూక్ష్మ సేద్యాన్ని విస్తరించినట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తెలిపింది. తద్వారా ఏపీలో ఐదేళ్లలో 2,73,888 మంది రైతులకు ప్రయోజనం చేకూర్చినట్లు వివరించింది. సూక్ష్మ సేద్యం కింద డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలతో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని వెల్లడించింది. ఈ పథకంపై నీతి ఆయోగ్ అధ్యయనం నిర్వహించిందని, జాతీయ ప్రాధాన్యతలను సాధించడంలో ఈ పథకం కీలకమని పేర్కొందని కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ పథకం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరిచి, పంట ఉత్పాదనను, ఉత్పత్తిని పెంచుకుని, ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు రైతుల ఆదాయం పెరుగుతుందని నీతి ఆయోగ్ ప్రశంసించినట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది. సెంటర్ ఫర్ మేనేజ్‌మెంట్ ఇన్ అగ్రికల్చర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (అహ్మదాబాద్) ద్వారా 2023లో ఏపీతో సహా దేశంలోని 6 రాష్ట్రాల్లో అధ్యయనం చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిత్వ శాఖ తెలిపింది. నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం కోసం మైక్రో ఇరిగేషన్ కవరేజీపై అధ్యయనం చేసిందని పేర్కొంది. ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి సిఫార్సులు చేసిందని తెలిపింది. నీటి కొరత, నీటి ఒత్తిడి, క్లిష్టమైన పరిస్థితుల్లో మైక్రో ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. తద్వారా భూగర్భ నీటిని సంరక్షించడానికి సూక్ష్మ సేద్యాన్ని మరింత ఎక్కువ విస్తీర్ణంలో విస్తరించే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొంది. గత ఐదేళ్లలో (2019-20 నుంచి 2023-24) సూక్ష్మ సేద్యంలో కర్ణాటక 13.30 లక్షల హెక్టార్లలో తొలి స్థానంలో ఉండగా ఆ తరువాత తమిళనాడు 7.79 లక్షల హెక్టార్లు, రాజస్థాన్ 6.16 లక్షల హెక్టార్లు, ఒడిశా 5.91 లక్షల హెక్టార్లు, గుజరాత్ 5.24 లక్షల హెక్టార్లు, ఆంధ్రప్రదేశ్ 3.09 లక్షల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం విస్తరించినట్లు వివరించింది.

## ఏడు హామీలను ప్రకటించిన కాంగ్రెస్



ఢిల్లీ : హర్యానా అసెంబ్లీ ఎన్నికలు వచ్చేనెలలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఏడు హామీలను ప్రకటించింది. ఈ హామీల్లో ఎంఎస్‌పికి మద్దతు ధర, కులగణన సర్వే కూడా ఉన్నాయి. మంగళవారం ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో ఏడు హామీలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఖర్గేతోపాటు, కాంగ్రెస్ హర్యానా చీఫ్ ఉదరు భాన్, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా, హర్యానా ఎన్నికల ఏఐసిసి పరిశీలకులు అశోక్‌గెహ్లాట్, అజరు మాకెన్, ప్రతాప్‌సింగ్ బజ్వాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. 'ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రటించిన ఈ హామీలకు 'సాత్ వాదే, పక్కే ఇరాదే' అనే పేరుపెట్టాం. మేము ప్రకటించిన ఈ హామీలను కచ్చితంగా అమలు చేస్తాం. అందుకే ఈ హామీలకు ఈ పేరు పెట్టాం' అని ఆయన అన్నారు. కాగా, మహిళా సాధికారిత కింద గ్యాస్ సిలిండర్ రూ. 500లకే కాంగ్రెస్ ఇవ్వనుంది. ప్రతినెలా 18-60 ఏళ్ల లోపు ఉన్న మహిళలందరికీ రూ. 2000 ఇస్తామని ఆ పార్టీ వాగ్దానం చేసింది. - సామాజిక భద్రతను బలోపేతం చేయడానికి వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ప్రతినెలా రూ.6 వేలు పెన్షన్. అలాగే ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్. 25 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స. రైతుల సంక్షేమం కోసం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టపరమైన హామీ. కులగణన చేపడతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కులగణనలో సర్వేలో క్రిమీ లేయర్ పరిమితిని రూ.6 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చారు.హర్యానా అసెంబ్లీ ఎన్నికలు అక్టోబర్ 5వ తేదీన ఒక దశలో పోలింగ్ జరగనుండగా, 8వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలవడనున్నాయి. 90 అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్, బిజెపి, జెజెపి పార్టీల మధ్య హెూరాహెూరీ పోటీ నెలకొంది.

## సెప్టెంబర్ 21న సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న అతిషి..!



ఢిల్లీ : సెప్టెంబర్ 21న ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అతిషి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అందుకు సంబంధించి.. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రమాణ స్వీకారం గురించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తెలియజేసారు. ఈ క్రమంలో.. అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్‌కి తన రాజీనామాను సమర్పించారు. అతిషి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి దావా వేశారు. అయితే ప్రమాణ స్వీకార తేదీకి సంబంధించి ఆమ్ ఆద్మీ పార్టీ ఎలాంటి తేదీని ప్రకటించలేదు. ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రిని ప్రకటించనుండటంతో అతీషీ కొత్త కేబినెట్‌గా మారనుంది. కొత్త కేబినెట్‌లో పాత ముఖాలందరికీ అవకాశం దక్కవచ్చని భావిస్తున్నారు. మరోవైపు.. అతిషి ముఖ్యమంత్రి కానుండటంతో అందులో ఇద్దరు కొత్త ముఖాలు చేరనున్నాయి. కొత్త మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న పదవులపై ప్రాంతీయ, కుల సమీకరణాలను పరిష్కరించేందుకు పార్టీ ప్రయత్నిస్తుంది. కాగా.. షెడ్యూల్డ్ కులాల సభ్యుడు మంత్రివర్గంలో చోటు దక్కించుకునే అవకాశం ఉండగా రెండవది పూర్వాంచల్‌తో సహా మరే ఇతర ప్రాంతం నుండి ఒకరికి దక్కవచ్చని చెబుతున్నారు.

రేసులో ఉన్న పేర్లు ఇవే:

ప్రస్తుత మంత్రివర్గాన్ని మార్చేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా లేరని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుత మంత్రులకు మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే సమయంలో మిగిలిన రెండు మంత్రి పదవుల కోసం పలువురు ఎమ్మెల్యేలు రేసులో ఉన్నారు. సోమనాథ్ భారతి, దుర్గేష్ పాఠక్, సంజీవ్ ఝా, దిలీప్ పాండే, మహేంద్ర గోయల్ జనరల్ సీటుపై మంత్రి రేసులో ఉన్నారు. మరోవైపు.. కులదీప్ కుమార్, విశేష్ రవి, గిరీష్ సోనీలు ఎస్టీ కోటా నుంచి మంత్రుల రేసులో ఉన్నారు. కాగా.. ఢిల్లీ కేబినెట్‌కు సంబంధించి గురువారం నాటికి నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే.. రాష్ట్రపతి నుంచి గ్రీన్ సిగ్నల్ లభిస్తే.. శుక్రవారం కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది.

తొలి కేబినెట్‌లో మహిళా సమ్మాన్ యోజన:

ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి శాసనసభా పక్ష నేతగా ఎన్నికైన అతిషి నేతృత్వంలో ఏర్పాటవుతున్న ఢిల్లీ ప్రభుత్వ తొలి మంత్రివర్గంలో ఢిల్లీ ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన బిల్లుకు ఆమోదం పొందే అవకాశం ఉంది. అక్టోబరు మొదటి వారంలో కొత్త ప్రభుత్వం తొలి కేబినెట్ సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నారు. ఇందులో ఢిల్లీ ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజనపై ప్రముఖంగా చర్చించనున్నారు. ఈ పథకం కోసం ఢిల్లీ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2,000 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద ఢిల్లీలో 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకు నెలకు వెయ్యి రూపాయలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే.. ఉద్యోగం చేస్తున్న లేదా ఆర్థిక ప్రయోజనాలను పొందుతున్న మహిళలు ఈ పథకం ప్రయోజనం పొందలేరు. అంతే కాకుండా.. ఢిల్లీ జల్ బోర్డు యొక్క బిల్లు మాఫీ పథకం సహా ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ఇతర అంశాలపై చర్చించనున్నారు.

## కేటీఆర్‌కు మంత్రి దామోదర రాజనర్సింహా హెచ్చరిక..!



**హైదరాబాద్, :** ప్రభుత్వ దవాఖాన్లను నాశనం చేసే కుట్రలను మానుకో అని కేటీఆర్‌కు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా హెచ్చరించారు. గాంధీ హాస్పిటల్‌పై బురద జల్లి, ఇక్కడికి ట్రీట్‌మెంట్ కోసం వచ్చే నిరుపేదల మనో స్థైర్యాన్ని దెబ్బతీయడం బాధాకరం. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కార్పొరేట్ హాస్పిటళ్లు ఏ విధంగా ఎదిగాయో ప్రజలందరికీ తెలుసు. ప్రభుత్వ దవాఖాన్లను ఎలా దెబ్బతీశారో కూడా జనాలు మర్చిపోలేదు. గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ దవాఖాన్లను పది సంవత్సరాల పాటు నాశనం చేసిన బీఆర్‌ఎస్, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి కూడా అదే తరహా కుట్రలు చేయడం సిగ్గుచేటు. గాంధీ వంటి టెర్షియరీ కేర్ హాస్పిటళ్లకు అత్యంత విషమంగా ఉన్న పేషెంట్లు వస్తారు. చివరి నిమిషం వరకూ వాళ్ల రోగాన్ని నయం చేసి, ఎలాగైనా వాళ్లను బ్రతికించేందుకు డాక్టర్లు తమ శక్తిమేర ప్రయత్నిస్తారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉండడం వల్ల కొంత మంది ప్రాణాలు కోల్పోతారు. అందుకే దేశంలోని ఏ టెర్షియరీ కేర్ హాస్పిటల్‌లోనైనా, ప్రతి నెలా పదుల సంఖ్యలో మరణాలు జరుగుతుంటాయి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే మరణాలు జరిగాయంటూ నంబర్లను భూతద్దంలో పెట్టి చూపించే ప్రయత్నాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్నారు. ఆయన అజ్ఞానికి, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాసే ఆయన సహజ గుణానికి ఆయన మాటలు అద్దం పడుతున్నాయి. గాంధీని నాశనం చేసి, పేషెంట్లను రానీయకుండా చేసి కార్పొరేట్ హాస్పిటళ్లకు లబ్ది చేకూర్చాలని ఆయన కుట్ర పన్నుతున్నారు. ఆ కుట్రలో భాగంగానే గాంధీ హాస్పిటల్‌పై బురద జల్లుతున్నారు. ఇకనైనా ఇలా పేదలకు ఉపయోగపడే ప్రభుత్వ వ్యవస్థలను నాశనం చేయడం మానుకోకపోతే, ప్రజలే ఆయనకు బుద్ధి చెబుతారు అని దామోదర రాజనర్సింహా పేర్కొన్నారు.

## ప్రధాని మోడీ వంద రోజుల పాలన ట్రైలర్ మాత్రమే..



**హైదరాబాద్, :** ప్రధాని మోడీ వంద రోజుల పాలన ట్రైలర్ మాత్రమే అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. వరసగా మూడు సార్లు బీసీ నేత ప్రధాని ఐన ఘనత మోడీకి దక్కిందన్నారు. దీనిని రాహుల్ గాంధీ, ఆయన కుటుంబం జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. గత వందరోజుల్లోనే చారిత్రక, వికసిత భారత్ దిశగా నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. ఆరు గ్యారంటీల పేరుతో మూడు రాష్ట్రాల్లో గెలిచిన కాంగ్రెస్ వంచిస్తోందన్నారు. వికసిత భారత్ సంకల్ప రోడ్ మ్యాప్ దిశగా మోడీ పాలన అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేల రైతులకు పెద్ద పీట అని తెలిపారు. నేషనల్ హైవేలు, రైల్వే లైన్లు, ఓడ రేవులు నిర్మాణం వంద రోజుల్లో చేపట్టామన్నారు. 70 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్స్ కు అయుశ్మాన్ భారత్ వర్తింపు అని తెలిపారు. దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలో 75 వేల సీట్లు పెంపు అన్నారు. పేపర్ లీకేజీ నివారణకు కొత్త చట్టం తీసుకొచ్చామని తెలిపారు. మోడీ ఈ వంద రోజుల పాలన ట్రైలర్ మాత్రమే అన్నారు. వంద రోజుల పాలనపై మేము చర్చకు సిద్ధం అన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ లతో డిబేట్ కు సిద్ధమని తెలిపారు.

# విలీనం కాదు.. విమోచనం కాదు.. ముమ్మాటికీ ప్రజా విద్రోహ దినం!



సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ప్రాధాన్యత కలిగిన రోజు మాత్రమే కాదు, ఇప్పటికీ చర్చనీయాంశంగానే మిగిలిన రోజు. 1948 సెప్టెంబర్ 17ను తెలంగాణకు విమోచన దినోత్సవం అని, భారత్‌లో విలీనమైన రోజని, తెలంగాణ ప్రజలకు విద్రోహం జరిగిన రోజు అని చర్చ ఇంకా కొనసాగుతూనే ఉంది. చరిత్రలో పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడి, ప్రాణాలర్పించిన కమ్యూనిస్టుల పాత్రను కనుమరుచేసే కుట్రలు జరుగుతున్నాయి. వాస్తవ చరిత్రను వక్రీకరించి, వక్రభాష్యాలు చెప్పి నేటి తరం తెలంగాణ ప్రజల మనసులను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ చారిత్రాత్మక దినాన్ని తమ పార్టీ త్యాగాల ఖాతాలో వేసుకునేందుకు రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. వాస్తవంగా జరిగింది ఏమిటి? ప్రజల పూర్తి సహకారం, భాగస్వామ్యంతో జరిపిన సాయుధ పోరాటంతో హైదరాబాద్ రాష్ట్రంలో కమ్యూనిస్టుల ఆధిపత్యం పెరిగింది. వారు నిజాంకు, దొరలకు ముచ్చెమటలు పట్టించారు. 1947 ఆగస్టు 15న దేశ స్వాతంత్ర ప్రకటన రావడంతో సంస్థానాలను దేశంలో విలీనం చేయాలనే ప్రతిపాదన ముందుకు వచ్చింది. దీంతో నిజాం సంస్థానం స్వాధీనానికి ప్రభుత్వం నడుం కట్టింది. అప్పటికే భయాందోళనలో ఉన్న నిజాం ప్రభువు బెట్టు చేయడంతో పోలీస్ (సైనిక) చర్య అనివార్యమైంది. 1948 సెప్టెంబర్ 17న దేశ హెూంశాఖ మంత్రి వల్లభాయ్ పటేల్‌తో రాజీపడి ఏడవ నిజాం తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు. దీనినే రాజకీయ పార్టీలు రకరకాలుగా వ్యాఖ్యానించడం పరిపాటి అయ్యింది.

### విలీనమూ లేదు.. విమోచనా జరగలేదు!

1948 సెప్టెంబర్ 17న తెలంగాణ భారతదేశంలో విలీనమైనట్లు కనిపించినా, అది అసంపూర్ణమే. నిజాం ప్రభువుకు తగిన గౌరవమే దక్కింది. ఆయనకు ఎలాంటి శిక్షా విధించలేదు. ఆయన అరాచకాలు కూడా కొనసాగాయి. విమోచనం జరిగింది, అనుకుంటే నిజాం ఇక్కడి నుండి పారిపోవాలి లేదంటే అతని అధికారాలు, ఆస్తులు జప్తు చేయబడాలి. చేసిన దుర్మార్గాలకు గాను శిక్ష అనుభవించాలి. కానీ అలాంటివేమి జరగలేదు. భారత ప్రభుత్వానికి నిజాంకు మధ్య యథాస్థితి కొనసాగించే ఒప్పందం మాత్రమే కుదిరింది. సర్ఫేఖాస్ భూములు ఆయన ఆధీనంలోనే ఉన్నాయి. ఏడవ నిజాం నవాబు ప్రజలను పీడించి కూడబెట్టిన బంగారం, నగలు, వజ్రాలు ఇతర దేశాలకు స్వేచ్ఛగా తరలించబడ్డాయి. అంతేకాదు 1850 జనవరి నుండి 1956 అక్టోబర్ వరకు రాజ్ ప్రముఖ్‌గా రాజభవన్‌లోనే ఉండి అధికారం చలాయించారు. ఆపరేషన్ పోలో తర్వాత1971 వరకూ సంవత్సరానికి 50 లక్షలు రాజభరణంగా నిజాంకు చెల్లించారు. వీటికి పన్ను మినహాయింపు ఇచ్చారు. నాటి ప్రధాని ఇందిరా గాంధీ దీనిని రద్దు చేసింది. గ్రామాలలో 1948 నాటికి ప్రజల తిరుగుబాటు పెరిగి, కమ్యూనిస్టు పార్టీ బలపడడం భారత ప్రభుత్వం గమనించింది. దీనికి తోడు దున్నే వాడిదే భూమి ప్రాతిపదికగా 10 లక్షల ఎకరాలు ప్రజల స్వాధీనం అయ్యింది. 3000 గ్రామాలలో గ్రామ రాజ్య కమిటీలు ఏర్పడ్డాయి. దీనిని ప్రమాదంగా భావించిన భారత ప్రభుత్వం (కాంగ్రెస్ పాలకులు) నిజాంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అంతకుమించి విలీనం జరగలేదు. విమోచన అంతకంటే జరగలేదు. అందుకే 1948 సెప్టెంబర్ 17లో జరిగింది ముమ్మాటికి ప్రజా విద్రోహమే.

### ప్రజా విద్రోహ చర్యలు చేపట్టి..

సుదీర్ఘకాలం పోరాడి, రక్తతర్పణం చేసి ప్రజలు సాధించుకున్న హక్కులని కోల్పోయారు. స్వాధీన పరచుకున్న భూమి మళ్లీ దొరల పాలయ్యింది. రూమీ టోపీలతో గ్రామాలను వదిలి హైదరాబాద్ చేరిన దొరలు ఖద్దరు టోపీలతో వచ్చి గ్రామాలపై పెత్తనం కొనసాగించారు. ప్రజా విముక్తి కోసం ఏర్పడ్డ సంఘాలు తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్నాయి. కమ్యూనిస్టు పార్టీ దళాలు భారత సైన్యం తుపాకులకు బలయ్యాయి. నిజాంపై తిరుగుబాటు చేసిన సుమారు నాలుగువేల మంది కిరాతకంగా హత్య చేయబడ్డారు. పౌర ప్రజాస్వామిక హక్కులు అడుగంటాయి. హైదరాబాద్ సంస్థానంలో నిజాం, దొరలు, రజాకార్లు చేసిన దురాగతాలపై ఎలాంటి విచారణలు జరగలేదు, ఎలాంటి శిక్షలనూ విధించలేదు. నిజాంపై తిరుగుబాటు చేసి అక్రమ నిర్బంధం పాలైన కవులు, రచయితలు, ఉద్యమకారులను జైళ్ల నుండి విడుదల చేయలేదు. ఇవన్నీ ప్రజా విద్రోహ చర్యలే కదా. అందుకే తెలంగాణకు జరిగింది ముమ్మాటికి విద్రోహమని నినదించక తప్పదు.

### ఉనికే లేని పార్టీల ఆర్భాటమే జాస్తి!

సెప్టెంబర్ 17ను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ప్రతిపాదనలు కూడా వస్తున్నాయి. దీని కోసం ఈ ఉద్యమంతో ఏ సంబంధం లేని రాజకీయ పార్టీలు హడావిడి చేయడం ఆశ్చర్యం గొలిపే విషయం. ఈ సందర్భంలో నిజాంతో ఒప్పందం చేసుకున్న కేంద్రంలో ని జాతీయ ప్రభుత్వం కూడా ద్రోహంలో భాగస్వామనే చెప్పాలి. బీజేపీ, టీడీపీ, బీఆర్‌ఎస్ వంటి పార్టీల విషయానికి వస్తే ఆ ఉద్యమ సమయానికి ఈ పార్టీలు మనుగడలోనే లేవు. కానీ వీటి ఆర్భాటమే మరీ ఎక్కువగా ఉంది. చరిత్రను ఎప్పుడూ వాస్తవిక దృష్టి తోనే చూడాలే తప్ప, తమదైన దృష్టితో చూడరాదు.

# ఎస్‌జీటీలపై వివక్ష ఇంకెన్నాళ్లు..




తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాల విద్యావ్యవస్థలో అధిక సంఖ్యలో ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులపైన అంతులేని వివక్ష కొనసాగుతున్నది. పాఠశాల విద్యావ్యవస్థకు పునాది అయినా ప్రాథమిక పాఠశాలలను సంరక్షిస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు అటు పదోన్నతుల్లో ఇటు వేతన స్థిరీకరణలో తీవ్ర అన్యాయం జరుగుతున్నది. ఉపాధ్యాయ సంఘాలకు సభ్యత్వాలు ఇవ్వడంలో వివిధ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలకు ముందు వరుసలో ఉండే వీరిని అటు ప్రభుత్వం, ఇటు సంఘాలు పట్టించుకోకపోవడం వల్ల వారి సమస్యలు తీరక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం, ప్రాథమిక పాఠశాలలో ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయులు ఉండాలనే అశాస్త్రీయమైన నిబంధన వల్ల ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయి. రాష్ట్రంలోని సింహభాగం ప్రాథమిక పాఠశాలలో సగటున ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గిందని ఉన్న రెండు పోస్టుల్లో ఒకటి తీసేస్తారు లేదా డిప్యూటేషన్ పంపిస్తారు. గ్రామంలోని తల్లిదండ్రులు ఒక్కరితో బడి ఎలా నడుస్తుందని వారి పిల్లలను ప్రైవేట్ బడులకు పంపిస్తున్నారు. చివరకు పిల్లల సంఖ్య జీరో అయిందని ఆ బడి మూసివేసే పరిస్థితి వస్తున్నది. ఇలా రాష్ట్రంలో గత మూడేళ్లలో దాదాపుగా 1500 ప్రాథమిక పాఠశాలలను జీరో విద్యార్థుల నమోదు కారణం చేత మూసివేశారు. 317జీవో, ఇటీవల జరిగిన బదిలీల వల్ల రాష్ట్రంలో 20% పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోయాయి. విద్యాహక్కు చట్టం నిబంధనలు సవరించి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఇచ్చి పనిభారం తగ్గించాలని ఎస్‌జీటీ ఉపాధ్యాయులు వేడుకుంటున్నారు.

### పదోన్నతులలో తీవ్ర అన్యాయం!

పాఠశాల విద్యావ్యవస్థలో 65 వేల పైగా ఉన్న ఎస్జీటీలకు ఇటీవల జరిగిన పదోన్నతులలో తీవ్ర అన్యాయం జరిగినది. ఉద్యోగులకు సంబంధించి వివిధ క్యాడర్లలో రెండేళ్లకే పదోన్నతి వస్తే ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు మాత్రం 20-25 ఏండ్లు గడిచిన పదోన్నతి అందని ద్రాక్షగా మారినది. ఉమ్మడి రాష్ట్రంలో గతంలో అదనపు విద్య అర్హతలకు అదనపు ఇంక్రిమెంట్లు ఇచ్చేవారు. కానీ ఆ తర్వాత దాన్ని రద్దు చేయడం వల్ల ఉద్యోగ కాలంలో వచ్చే నాలుగు ఇంక్రిమెంట్లను ఎస్‌జీటీలు కోల్పోయారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎస్జీటీలకు నెలకు రూ.125 అదనపు అలవెన్స్ ఇస్తున్నారు. ఇంత తక్కువ భత్యం ఇవ్వడం తమను అత్యంత దారుణంగా అవమానించడమే అని ఎస్‌జీటీలు వాపోతున్నారు. అలాగే ఇటీవల జరిగిన పండిత పీఈటీ అప్‌గ్రేడేషన్‌లో అన్ని అర్హతలు ఉన్న ఎస్జీటీలకు పదోన్నతులు దక్కకపోవడం వలన ఎస్జీటీలు తీవ్ర నిరాశలో ఉన్నారు.

### ప్రతి పీఆర్సీలోను అన్యాయమే..!

రాష్ట్రంలో సింహభాగం ఉన్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ప్రతి వేతన సవరణలో తీవ్ర అన్యాయం జరుగుతున్నది. ఒకే విద్యా అర్హతలు కలిగి పాఠశాల విద్యలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు ఎస్‌జీటీలకు వేతన వ్యత్యాసం అంతకంతకు పెరుగుతున్నది. 2010 పీఆర్సీలో ఎస్‌జీటీలకు రూ. 10,900 ఉండగా స్కూల్ అసిస్టెంట్లకు రూ.14,860గా ఉంది. కానీ 2015 పీఆర్సీలో ఎస్‌జీటీలకు జీతం రూ. 21,230 ఉండగా స్కూల్ అసిస్టెంట్లకు రూ. 28,940కి పెరిగినది. 2020 పీఆర్సీలో ఎస్‌జీటీల జీతం రూ. 31,040కి పెరగగా స్కూల్ అసిస్టెంట్ల జీతం రూ. 42,300 అయినది. తెలంగాణ రాష్ట్రంలో త్వరలో ఇవ్వనున్న రెండవ వేతన సవరణలో భాగంగా ఉపాధ్యాయ సంఘాలు ఎస్ఏల జీతం 77 వేలకు పైగా ప్రతిపాదించగా ఎస్జీటీల వేతనంను కేవలం 62000 మాత్రమే ప్రతిపాదించాయి. వీరికి ఇటు సంఘాలు అటు ప్రభుత్వం వేతన స్థిరకరణలో తీవ్ర అన్యాయం చేస్తున్నాయి.

### ఓటు హక్కు కల్పించాలి!

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు లేకపోవడం వల్ల ఎస్జీటీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నది. కావున మొదటగా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న అందరి ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి. అలాగే ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్‌ల వేతన వ్యత్యాసం తగ్గించి పీఆర్సీలో బేసిక్ జీతం పెంచాలి. 12 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ప్రతి ఎస్‌జీటీ ఉపాధ్యాయుడికి స్కూల్ అసిస్టెంట్ హెూదా ఇవ్వాలి. అలాగే 24 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎస్‌జీటీకి జీహెచ్‌ఎం హెూదా ఇవ్వాలి. విద్యా హక్కు చట్టం నిబంధనను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుని కేటాయించి ఎస్‌జీటీల పనిభారాన్ని తగ్గించాలి. అలాగే ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుని నియమించాలి. ఎస్‌జీటీ ఉపాధ్యాయుడికి తీవ్ర ఒత్తిడిని కలిగిస్తున్న ఎఫ్.ఎల్.ఎన్, సీసీఈ కార్యక్రమాలను రద్దు చేయాలి. పాఠశాల విద్యలో పునాది అయిన ప్రాథమిక విద్యను సంరక్షిస్తే నేటి బాలలు రేపటి భావి భారత పౌరులుగా ఎదుగుతారు.

# మణిపూర్ బాధ్యతలకు కేంద్రం తిలోదకాలు




మణిపూర్‌లో జాతి ఘర్షణలు ప్రజ్వరిల్లి ఇప్పటికి 16 నెలలు గడచిపోయాయి. వీటిలో 250 మందికి పైగా మరణించగా మరి ఎంతోమంది హింసాకాండలో గాయపడ్డారు. 60,000 మంది ప్రజలు నివాసాలు కోల్పోయి శరణార్థులుగా బతుకుతున్నారు. కేంద్ర ప్రభుత్వం, బిజెపి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘర్షణకు దారి తీసిన మౌలిక సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైనాయి. పరిస్థితి మరింత దిగజారి జాతి విభజన మరింత తీవ్రం కావడానికి దారి తీశాయి. కేవలం కుకీ ప్రాబల్యం గల కొండ ప్రాంతాలకూ, మెయితీలు ప్రధానంగా ఉన్న లోయ ప్రాంతానికి మధ్య ఒక రక్షిత ప్రాంతాన్ని ఏర్పాటు చేయడానికే 60,000 మంది కేంద్ర పోలీసు బలగాలు పనికి వస్తున్నాయి. గత 15 రోజుల్లో పరిస్థితి గణనీయంగా దిగజారింది. పశ్చిమ జిల్లాలో మెయితీలు ప్రధానంగా వుండే ప్రాంతం కౌత్రక్‌లో సెప్టెంబర్ ఒకటవ తేదీన ఇద్దరు వ్యక్తులు చంపివేయబడగా డ్రోన్ దాడిలో తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ దాడి వెనుక కొందరు కుకీ తీవ్రవాదులు ఉన్నారని సందేహాలున్నాయి. అలాగే మరో ప్రాంతంలో ఒక రాకెట్ దాడి కూడా జరిగింది. సెప్టెంబర్ ఆరున జిరిబాం జిల్లాలో ముగ్గురు సాయుధ తీవ్రవాదులతో సహా ఐదుగురు చంపబడ్డారు. రెండు రోజుల తర్వాత పశ్చిమ ఇంఫాల్ జిల్లాలోని మెయితీ ప్రాంతం దాటి మధ్యంతర ప్రదేశంలోకి ప్రవేశించినందుకు కుకీ మూలాలు గల ఒక మాజీ సైనిక ఉద్యోగిని కొట్టి చంపారు.

### అసలు సమస్య

వాస్తవం ఏమంటే ఒకరికి సంబంధించిన ప్రాంతంలోకి మరొకరు అడుగు పెట్టే పరిస్థితే లేదు. తాజాగా ఈ హింసా ప్రజ్వలన తర్వాత ఇంఫాల్ తదితర జిల్లాల్లో తీవ్ర స్థాయిలో విద్యార్థుల నిరసనలకు కారణమైంది. భద్రత సలహాదారును, డిజిపి ని తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు. కుకీ తీవ్రవాదులతో ఆపరేషన్ నిలుపుదల ఒప్పందాన్ని (ఎఒఒ) రద్దు చేయాలనే ఉమ్మడి కమాండ్ కంట్రోల్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని వారు కోరుతున్నారు. పోలీసులతో ఘర్షణలు ఇంఫాల్ తూర్పు పశ్చిమ జిల్లాలలో కర్ఫ్యూ విధించడానికి దారితీశాయి. ఇంటర్నెట్, మొబైల్ డేటా కూడా నిలిపివేయ బడ్డాయి. ఇరుపక్షాలతో సంప్రదింపులు, చర్చలు జరిపి రాజకీయ సమస్యను పరిష్కరించడంలో వైఫల్యంతో శాంతిభద్రతల పరిరక్షణకు, అలాగే చీలికల మధ్య శాంతిని కాపాడటానికి భద్రత బలగాలపై అతిగా ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల కేంద్ర పోలీస్ బలగాలు ప్రత్యేకించి అస్సాం రైఫిల్స్ ఒక అనివార్యమైన స్థానంలోకి వచ్చాయి. మెయితీ రాజకీయ పక్షాలు అస్సాం రైఫిల్స్‌ను, ఇతర కేంద్ర బలగాలను ఉపసంహరించాలని కోరుతున్నాయి. కుకి తీవ్రవాదులు డ్రోన్లను, రాకెట్లను ప్రయోగించటం వల్ల బయటి శక్తులు చొరబడుతున్నాయనే ఆందోళన మరింత పెరిగింది. ఇది జాతీయ భద్రతకు ముప్పు అవుతుంది.

### ముఖ్యమంత్రి పాక్షిక వైఖరి

కుకీ మిలిటెంట్ గ్రూపులతో ఆపరేషన్ల నిలుపుదల ఒప్పందం రద్దు చేయాలనే డిమాండ్ ముఖ్యమంత్రి ఎన్.బిరేన్ సింగ్ నుంచి కూడా రావడం వల్ల కొండ ప్రాంతాల్లో మరోసారి తిరుగుబాటు కార్యక్రమాలు మొదలవవచ్చు. తిరుగుబాటును అణచివేయటానికి సైన్యాన్ని మొహరించే పరిస్థితీ రావచ్చు. మెయితీ తెగ వారికి గిరిజన ఎస్టీ ప్రతిపత్తి కల్పించాలనే కోర్కెతో మొదలైన ఆందోళన, దానికి కుకీ-జో తెగల వారి నుంచి వచ్చిన ప్రతికూల స్పందన, ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ పాక్షిక పాత్ర వహించడం వల్ల మరింత తీవ్రతరమైంది. ఆయన కొన్ని మెయితీ తీవ్రవాద సంస్థల పట్ల సానుకూల సహాయ పాత్ర వహిస్తున్నారు. ఇటీవలనే బయిటకు వచ్చిన ఒక ఆడియో ఫైల్‌ను అల్లర్లపై దర్యాప్తు జరుపుతున్న విచారణ కమిషన్‌కు సమర్పించారు. ముఖ్యమంత్రి తన అధికార నివాసం నుంచి మాట్లాడుతున్నట్టు పోలీసు ఆయుధాగారం నుంచి వేలాది ఆయుధాలు కొల్లగొట్టిన వారి పట్ల ఆయన అనుకూలంగా ఉన్నట్లు ఆ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. బిరేన్ సింగ్ ముఖ్యమంత్రిగా నిష్పాక్షిక వైఖరి అనుసరించకపోవటమే సమస్యకు మూల కారణం.

### కేంద్రం, బిజెపి బాధ్యతా రాహిత్యం

మోడీ ప్రభుత్వం, బిజెపి కేంద్ర నాయకత్వం ముఖ్యమంత్రి పాక్షిక పాత్ర పూర్తిగా తెలిసి కూడా అతన్నే పదవిలో కొనసాగిస్తున్నారు. రాజకీయ స్థాయిలో చూస్తే బి.జె.పి, ఆర్.ఎస్.ఎస్ లు మెయితీ తీవ్రవాద జాతిదురభి మానానికి మరింత ఆజ్యం పోయడానికే పాల్పడుతున్నాయి. ఈ తీవ్రవాద సంస్థ వ్యవస్థాపకుడైన టెంగోల్ ఎల్ సనజోబా ను రాజ్యసభ సభ్యుడిని చేయటమే ఇందుకు నిదర్శనం. ఈ సుదీర్ఘమైన ప్రతిష్టంభన అన్ని తరగతుల వారిలోనూ తీవ్రవాదాన్ని మరింత బలోపేతం చేయడానికి కారణమైంది. ప్రధాని నరేంద్ర మోడీ గత 16 నెలల్లో ఒక్కసారి కూడా మణిపూర్ సందర్శించలేదంటే మణిపూర్ పట్ల కేంద్ర బాధ్యతను విస్మరించటం ద్వారా మరింత పచ్చిగా కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం నేరుగా రంగంలోకి దిగాలి. ప్రధాన జాతుల గ్రూపులతో రాజకీయ సంప్రదింపుల ప్రక్రియ ప్రారంభించటం జరగాలి. శాంతియుత సాధారణ పరిస్థితులను సృష్టించే వాతావరణం కావాలి. అన్ని జాతుల, పౌరుల హక్కులు రక్షించబడాలి. మణిపూర్‌లో ఈ రోగగ్రస్త భాగాన్ని శస్త్ర చికిత్సతో దేహం నుంచి తొలగించకపోతే అది మొత్తం ఈశాన్య భారతంలోనే చాలా తీవ్రమైన పర్యవసానాలకు దారితీస్తుంది.